అదే స్థి(గ)తి

- వసతులుండవు..లబ్ధిదారులు వెళ్లలేరు
- నివాసానికీ అననుకూల వాతావరణం
- నిరుపయోగంగా టిడ్కో గృహాలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వాలని టిడ్కో ఇళ్లు ఇచ్చినా వాటి పరిస్థితి మారడం లేదు. టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. నివాసానికి అనానుకూల వాతావరణం ఉండటంతో లబ్ధిదారులు వాటిలో ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు...

పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్న ఉద్దేశంతో టిడిపి ప్రభుత్వంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో టిడ్కో గృహాల పేరుతో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. తరువాత ప్రభుత్వం మారడంతో అవి అలానే ఉండిపోయాయి. వైసిపి ప్రభుత్వం వాటిని లబ్ధిదారులకు ఇచ్చే కార్యక్రమాలు కూడా ఆర్భాటంగా నిర్వహించింది. ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మొదలు పెట్టింది. కర్నూలు జిల్లా పరిధిలో కర్నూలు నగరంలోని జగన్నాథగట్టుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరులో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కర్నూలు నగరంలోని జగన్నాథగట్టు వద్ద 10వేల గృహాల నిర్మాణం చేపట్టారు. ఆ టిడ్కో ఇళ్లను జగనన్న నగర్‌గా నామకరణం చేసి మున్సిపల్, ఆర్థిక, కార్మిక శాఖ మంత్రులు సోమవారం ప్రారంభించారు. కర్నూలులో నిర్మించనున్న 10వేల ఇళ్లలో 300 చదరపు అడుగులకు సంబంధించి 3,888 ఇళ్లు, 365 చదరపు అడుగులకు సంబంధించి 19,04 ఇళ్లు, 430 చదరపు అడుగులకు సంబంధించి 4,208 ఇళ్లు నిర్మించనున్నారు. అధికారిక లెక్కల ప్రకారం వాటిలో 4,500 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. వాటిని లబ్ధిదారులకు ఇచ్చే కార్యక్రమాన్ని మంత్రులు చేపట్టారు. లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఇళ్లలోనూ సగానికి పైగా వాటిలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించలేదు. ఫ్యాన్లు, లైట్లు వంటి పనులు ఇంకా పూర్తి కాలేదు. చాలా వాటికి కిటికీల అద్దాలు పగిలిపోయి దర్శనమిస్తున్నాయి. ఆదోనిలోని సిరిగుప్ప రోడ్డులో 4704 గృహాలను నిర్మించారు. కొన్నింటిలో ఫ్లోరింగ్, మరికొన్నింటిలో పెయింటింగ్, ఇంకా కొన్ని వాటిలో లైట్లు లేవు. 2వ విడతలో మంజూరైన 3500 ఇళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిన తరువాత ప్రభుత్వం మారడంతో ఆ గృహాలను పూర్తిగా రద్దు చేశారు. టిడ్కో గృహ సముదాయాల పరిసరాల్లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేదు. నీటి సౌకర్యం కూడా కల్పించలేదు. ఎమ్మిగనూరులో శివన్న నగర్‌లో 2240, మైనార్టీ కాలనీలో 1024 ఇళ్లను ఇప్పటి వరకూ పూర్తి చేశారు. రెండో విడతలో మంజూరైన ఇళు పునాదులకు పరిమితం కాగా మూడో విడతలో మంజూరైన1796 ఇళ్ల నిర్మాణం అసలు ప్రారంభమే కాలేదు. మైనార్టీ కాలనీలో నీటి కోసం నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్ అసంపూర్తిగా ఉంది. గృహాల మధ్య ముళ్ల కంపలు ఏపుగా పెరిగాయి. సిసి రహదారులు పగుళ్లు ఇచ్చి కుంగిపోయాయి. ఇలా టిడ్కో గృహాలు నివాసానికి అనుకూలంగా లేకపోవడంతో లబ్ధిదారులు వాటిలో నివాసం ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు.

అద్దె ఇళ్లే దిక్కు..

ప్రభుత్వం టిడ్కో గృహాల పేరుతో ఇళ్లను కేటాయించినా వాటిలో మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు వెళ్లకపోవడంతో అద్దె ఇళ్లే దిక్కవుతున్నాయి. నెలకు రూ.4 నుంచి రూ.5 వేల ఇంటి అద్దె కట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మరో వైపు టిడ్కో గృహాలకు బ్యాంకులు ఇచ్చిన రుణాలను కూడా కొందరు లబ్ధిదారుల నుంచి వసూలు చేస్తుండటంతో ఆయా లబ్ధిదారులకు భారం రెట్టింపవుతోంది.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

- కలెక్టర్ సృజన

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

పశువుల హాస్టల్ నిర్వహణ గురించి ఆరా తీస్తున్న కలెక్టర్

అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యను, మెనూ ప్రకారం భోజనం అందజేయాలని అంగన్వాడీ సిబ్బందిని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. శుక్రవారం కల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో మెనూ ప్రకారమే చిన్నారులకు పౌష్టికాహార భోజనం అందిస్తున్నారా లేదా ? గర్భిణీ స్త్రీలకు ఏ ఆహారం అందిస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఐసిడిఎస్ పిడి ఉమామహేశ్వరిని కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రంలో పుస్తకాలను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం చిన్నారులకు చిన్ననాటి నుంచే విద్యను అందించాలనే లక్ష్యంతో పుస్తకాలను అందించి ప్రీ ప్రైమరీ స్కూల్‌గా ఇక్కడే వారికి విద్యను అందిస్తున్నారు. కనీసం ఆ పుస్తకాల మీద పేర్లు కూడా రాయలేదని అంగన్వాడీ టీచర్‌పట్ల జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పుస్తకాలలో రోజూ తేది నమోదు చేస్తూ పిల్లలకు రాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో పందుల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్తులు కలెక్టర్‌కు తెలుపగా.. తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కల్లూరు తహశీల్దార్ రమేష్‌బాబు ఉన్నారు

పాలకోవా కేంద్రం, సోలార్ డ్రైయర్ల పరిశీలన

తడకనపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన పాలకోవా కేంద్రంతో పాటు ఉల్లి, టొమాటో సోలార్ డ్రైయర్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పరిశీలించారు. తడకనపల్లె గ్రామంలోని ఎపిఎంఐపి పథకం కింద పొందిన పరికరాలను, పాలకోవా తయారీ యూనిట్లను, ఉల్లి, టొమాటో సోలార్ డ్రైయర్లను, పశువుల సంరక్షణ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. తడకనపల్లె పాలకోవా కేంద్రంలో పాలకోవా చేసే విధానాన్ని పరిశీలిస్తూ 20 లీటర్ల పాలకు 5 కిలోల చక్కెరకు ఎన్ని కేజిల పాలకోవా వస్తుందని గ్రామైఖ్య సంఘం లీడర్ జుబేదాని అడగగా 8 కిలోల పాలకోవా వస్తుందని, ఎవ్వరికైనా నెయ్యి కావాలన్నా, స్పెషల్‌గా బెల్లం పాలకోవా కావాలని ఆర్డర్లు వస్తే అవి కూడా చేస్తామని కలెక్టర్‌కు తెలిపారు. పాలు ఎక్కడి నుంచి తీసుకుని వస్తారని జుబేదాని అడగగా ఇక్కడ దగ్గర్లో ఉన్న పశువుల హాస్టల్లో నాలుగు గ్రూపులకు కలిసి 80 బర్రెలు ఉన్నాయని అక్కడి నుండి పాలు తెస్తామన్నారు. బాయిలర్ మిషన్ తక్కువ బడ్జెట్‌కు ఇప్పించినట్లయితే ఇంకా ఎక్కువమంది పాలకోవా కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నారని కలెక్టర్ దృష్టికి జుబేదా తెచ్చారు. అందుకు తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

పశువుల హాస్టల్ తనిఖీ చేస్తూ నిర్వహణపై జుబేదాను ఆరా తీశారు. ఇక్కడ పని వాళ్ళను ఏర్పాటు చేశామని, మొత్తం వాళ్లే చూసుకుంటారని, వాళ్లకు నెలకి రూ. 15 వేల వేతనం ఇస్తున్నామని, రోజుకు 300 లీటర్ల పాలు వస్తాయన్నారు. అవి మొత్తం పాలకోవాకు ఉప్పయోగిస్తామని చెప్పారు. పేడను రైతులు, ఎరువులకు ఉపయోగిస్తారని వివరించారు. పశువులకు దాణా వేసే గడ్డికి రసాయన ఎరువులు వాడకుండా వేసినట్లయితే ఆర్గానిక్‌పాలతో పాలకోవా తయారికి ఉపయోగ పడడమే కాకుండా వాటిని కొనుగోలు చేయడానికి ప్రజలు మరింత మక్కువ చూపిస్తారని కలెక్టర్ జుబేదాకు సూచించారు. డిఆర్‌డిఎ పిడి వెంకట సుబ్బయ్య, ఎపిఎంఐపి పిడి ఉమాదేవి, తడకనపల్లి గ్రామైఖ్య సంఘం లీడర్ జుబేదా పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కార్మిక హక్కులను హరిస్తే ఉద్యమం : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కార్మికుల హక్కుల హరించాలని చూస్తే ఉద్యమం తప్పదని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు డి.గౌస్‌దేశాయ్, నగర కార్యదర్శి సిహెచ్.సాయి బాబాలు హెచ్చరించారు. శుక్రవారం సిఐటియు కర్నూలు టౌన్ ఆయిల్ అండ్ రైస్ మిల్ హమాలి కార్మికుల జనరల్ బాడీ సమావేశం కెకె.భవన్‌లో కర్నూలు సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు అధ్యక్షతన నిర్వహించా రు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్ దేశాయ్, సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్.సాయిబాబా మాట్లాడారు. ఆయిల్ అండ్ రైస్ మిల్ హమాలీ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం, సంక్షేమానికి కూలి రేట్ల పెంపుదలకు ఐక్య పోరాటాలు చేయాలన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల కుటుంబాలు పనులు సరిగా లేక కుటుంబాలు గడవడమే కష్టంగా ఉంటే ప్రభుత్వాలు భారాలు వేయడమే పనిగా పెట్టుకుని ధరలు పెంచుతూ ప్రజలనడ్డివిరుస్తున్నాయన్నారు. కార్మికులకు రక్షణ కవచంగా ఉన్న 44 లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం కుదించి నాలుగు కోడ్‌లుగా మారుస్తుందన్నారు. యజమానులకు అనుకూలంగా కార్మికులకు వ్యతిరేకంగా ఈ చట్టాలను తీసుకొస్తుందన్నారు. దీనికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సభలు సమావేశాలు నిర్వహించే హక్కును అరించే జిఒ నంబర్ వన్ చట్టవ్యతిరేకమని, హైకోర్టు కూడా దీనిని రద్దు చేసిందన్నారు. కార్మికులు, కర్షకులు, కలిసి ఐక్య పోరాటాల ద్వారా మన పైన వేస్తున్న భారాలకు వ్యతిరేకంగా, మన హక్కులకు భంగం కలిగించే దానికి వ్యతిరేకంగా, కూలి రేట్ల పెంపుదల కోసం, మన సంక్షేమం కోసం పోరాటం చేయాలన్నారు. అనంతరం కర్నూలు టౌన్ ఆయిల్ అండ్ రైస్‌మిల్ హమాలీ కార్మికుల నూతన కమిటీని 26 మందితో ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులుగా తిరిగి డి.గౌస్‌దేశాయ్, కార్యదర్శిగా సి.హెచ్.సాయిబాబాను ఎన్నుకున్నారు. కోశాధికారిగా ఉస్మాన్ భాష, సహాయ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎర్రమల, రామిరెడ్డి, ఓంకారం, గాలన్న, శేఖర్, హనుమంతును ఎన్నుకున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

కష్టాలు వింటూ..హామీలిస్తూ..

- యువగళం పాదయాత్రకు నీరాజనాలు
- శ్రీశైలం నియోజకవర్గంలోకి ప్రవేశించిన యాత్ర

ప్రజాశక్తి-పాములపాడు/ఆత్మకూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర శుక్రవారం నందికొట్కూరు నియోజకవర్గంలోని పాములపాడు మండలంలో సాగి శ్రీశైలం నియోజకర్గం ఆత్మకూరు మండలంలోకి చేరుకుంది. నారా లోకేష్‌కు జనం నీరాజనాలు పలికారు. దారిపొడవునా ప్రజలు యువనేతకు నీరాజనాలు పడుతూ తాము ఎదుర్కొంటున్న కష్టాలు చెప్పుకున్నారు. మరో ఏడాదిలో రాబోయే చంద్రన్న ప్రభుత్వం అందరి కష్టాలు తీరుస్తుందని చెప్పి యువనేత ముందుకు సాగారు. బన్నూరు క్యాంప్ సైట్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర కృష్ణారావుపేట, రుద్రవరం, పాములపాడు, కంభాలపల్లి, ఎర్రగూడూరు మీదుగా శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రవేశించింది. శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గ శివార్లలో యువనేతకు అపూర్వ స్వాగతం లభించింది. శ్రీశైలం ఇన్‌చార్జి బుడ్డా రాజశేఖర్ రెడ్డి, సీనియర్ నేత ఏరాసు ప్రతాపరెడ్డి, పార్టీనాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున యువనేతకు ఎదురేగి స్వాగతం పలికారు. పాములపాడులో ఎస్సీలతో సమావేశమైన యువనేత లోకేష్ వారి సాధకబాధకాలను తెలుసుకున్నారు. వివిధ గ్రామాల ప్రజలు, రైతులు, మైనారిటీలు యువనేతకు ఎదురేగి తమ సమస్యలను తెలియజేశారు. తుమ్మలూరు గ్రామ రైతులు యువనేత లోకేష్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కేసీ కెనాల్ 102 తూము దగ్గరి నుండి పోతిరెడ్డిపాడు వరకు పంట కాలువకు సైడు కాలువ నిర్మాణం చేపట్టాలని, రైతులకు ఏటా కాల్వలో గడ్డి తీయడానికి రూ.1.5 లక్షలు ఖర్చు అవుతోందని, సొంత ఖర్చుతో పనులు చేసుకుంటున్నారని తెలిపారు. కృష్ణారావుపేటలో మహిళా వ్యవసాయ కూలీలను కలిసిన యువనేత లోకేష్ వారి సమస్యలను తెలుసుకున్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, కరెంట్ చార్జీలు, గ్యాస్ ధర పెరగడంతో వచ్చే కూలీ బ్రతకడానికి సరిపోవడం లేదని, ఎక్కువ రోజులు పనులు దొరక్క ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. జూటూరు గ్రామంలో ఉపాధి హామీ పథకంలో కాల్వగట్ల పనులు చేస్తున్న కూలీలను యువనేత లోకేష్ కలుసుకొని, వారి కష్టాలు తెలుసుకున్నారు. ఫేస్ రికగ్నేషన్ లేకపోతే డబ్బులు రావంటూ వేధిస్తున్నారని, గతంలో వేలిముద్ర వేస్తే సరిపోయేదని, మధ్యాహ్నం దాకా పనులు చేయించడం వల్ల ఇంటివద్ద పిల్లలకు భోజనం కూడా వండి పెట్టలేకపోతున్నామని కూలీలు లోకేష్‌కు వివరించారు. రుద్రవరం మైనారిటీలు లోకేష్‌ను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. కృష్ణారావుపేటలో పత్తి రైతును యువనేత లోకేష్ కలిసి ఆయన సాధకబాధకాలు తెలుసుకున్నారు. 3.5ఎకరాల్లో పత్తిపంట వేస్తున్నానని, నాలుగేళ్లుగా వరుస నష్టాలే వస్తున్నాయని, లక్షరూపాయలు ఖర్చవుతుంటే కనీసం పెట్టుబడులు కూడా రావడం లేదని రైతు సాయిబాబు తెలిపారు. 97వరోజు యువనేత లోకేష్ 16.5 కిలో మీటర్లు పాదయాత్ర చేశారు ఇప్పటివరకు 1239.5 కిలో మీటర్ల మేర పాదయాత్ర పూర్తయింది. శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గంలోని కె.స్టార్ గోడౌన్స్ వద్ద విడిది కేంద్రంలో యువనేత బసచేశారు. మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, ఎమ్మెల్సీ బిటి.నాయుడు, టిడిపి ఇంఛార్జి మాండ్ర శివానందరెడ్డి, కోడుమూరు ఇంఛార్జి ఆకెపోగు ప్రభాకర్, ఎస్సీ సెల్ నాయకులు ఎమ్మెస్ రాజు, నాయకులు బండి జయరాజు, జయ సూర్య, రుద్రవరం ఎంపీటీసీ అరుణ, కాకరవాడ చిన్న వెంకటస్వామి పాల్గొన్నారు.

ప్రజలకు అభివాదం చేస్తున్న నారా లోకేష్

ఘన స్వాగతం..

శ్రీశైలం నియోజకవర్గంలోకి లోకేష్ అడుగు పెట్టిన మరుక్షణం నుండే శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పెద్ద ఎత్తున టిడిపి శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. రాత్రి నారా లోకేష్ కరివేన ఎస్సార్ బీసీ సమీపంలో అక్కడే ఉండి శనివారం ఉదయం జిల్లా టిడిపి నాయకులు తో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. భోజనం అనంతరం అక్కడి నుండి ఆయన పాదయాత్ర ప్రారంభించి ఎస్‌ఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న బహిరంగ సభ వేదిక చేరుకొని సభలో ఆయన ప్రసంగించనున్నారు అనంతరం ఆత్మకూరు పట్టణంలో ఆయన పాదయాత్ర చేపట్టనున్నారు. నారా లోకేష్ కు ఘన స్వాగతం పలికిన వారిలో మాజీ న్యాయ శాఖ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి. శ్రీశైలం దేవస్థానం మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి. టిడిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కరీముల్లా, ఆత్మకూర్ టిడిపి అధ్యక్షుడు జెట్టి వేణుగోపాల్, ఇతర నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సిబిఎస్ఇ ఫలితాలలో కట్టమంచి ప్రభంజనం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు సమీపాన గల శ్రీ చైతన్య మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నడపబడుతున్న సిఆర్‌ఆర్ కట్టమంచి పాఠశాలలో సిబిఎస్ఇ పదవ తరగతి ఫలితాలలో 100శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థి వి. రాజారెడ్డి 483/500 మార్కులు సాధించి జిల్లా టాపర్గా నిలిచారు. సబ్జెక్టుల వారిగా సాధించిన మార్పులు ఇలా ఉన్నాయి.... తెలుగు100 , ఆంగ్లం 94, గణితం 95, సాంఘిక శాస్త్రం 99, సైన్సు95 మార్కులు వచ్చాయి. 400 కి పైగా మార్పులు సాధించిన విద్యార్థులు 27 మంది ఉన్నారు. ఈ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు అందరినీ ఎజిఎం సురేష్, ఆర్ఐ.రంగారెడ్డి, ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

జూన్ 12 వరకు హెచ్‌ఆర్‌సికి వేసవి సెలవులు

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఈనెల 10వ తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు వేసవి సెలవులను ప్రకటిస్తూ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. వేసవి సెలవుల్లో ఉన్నప్పటికి అత్యవసర కేసులను విచారణ చేపట్టేందుకు కమిషన్ పనిచేస్తుందని కమిషన్ సెక్రటరీ వెల్లడించారు.

లంచం అడిగితే ఎసిబికి ఫిర్యాదు చేయండి

విద్యుత్ ఎస్ఇ ఎం. ఉమాపతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : డబ్బుల కోసం విద్యుత్ అధికారులు వేధిస్తే ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేయాలని ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ఎం. ఉమాపతి చెప్పారు.18 వేల పెండింగ్ దరఖాస్తులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. దరఖాస్తు చేసుకునే అర్హులందరికీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామనితెలిపారు. ఇప్పటి వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో పెండింగులో ఉన్న 18వేల దరఖాస్తులకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. శుక్రవారం కర్నూలు విద్యుత్ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ అవసరాలకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కావల్సిన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైను, స్తంభాలు, ఇతర సామాగ్రి అంతా ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఇకపై అర్హులైన ప్రతి రైతుకు నిర్ణీత గడువులోపు కనెక్షన్లు ఇచ్చి, పగటి పూటే తొమ్మిది గంటల పాటు విద్యుత్ సరఫరా అందించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రైతులు విద్యుత్ కనెక్షన్ల కోసం చేసుకునే దరఖాస్తుతో పాటు నిర్ణీత సొమ్మును డిడిల రూపంలో చెల్లిస్తే సరిపోతుందన్నారు. కనెక్షన్లు, ఎస్టిమేట్లు, జంపర్ ఇవ్వడం వంటి పేర్లతో ఎవరైనా డబ్బు అడిగితే ఎఇ, ఎడిఇ , ఇఇలతో పాటు తనకు కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అయినా తీరు మారకపోతే దరఖాస్తు చేసుకునే సమయంలో ఇచ్చిన రసీదులో ఉన్న ఎసిబి అధికారుల ఫోన్ నంబర్‌కు సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. రైతులకు మంజూరు అయిన వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వడంలో జాప్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముఖ్యంగా ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు, స్తంభాలను తొలగించడం, తీగల ఎత్తు పెంచడం, మధ్యలో ఇంటర్ పోల్ వేయడంపై దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. దీని కోసం ప్రభుత్వం రూ.35కోట్లు మంజూరు చేసిందని, ఇందులో రూ.15 కోట్లు ఖర్చు చేసి పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఇంకా రూ.20కోట్ల నిధులు మిగిలి ఉన్నా యని, ఇప్పటికే ఆరు వేల స్తంభాలు ఏర్పాటు చేయగా మరో పది వేల స్తంభాలు పెట్టాల్సి ఉందని చెప్పారు. ప్రమాదకరంగా ఉన్న తీగలు, స్తంభాలను గుర్తించి లైన్మెన్ లేదా ఎఇలకు చెబితే నిధులు మంజూరు చేసి పనులు చేయిస్తామని తెలిపారు. టిడ్కో గృహాలకు ప్రత్యేక మేళ నిర్వహించి విద్యుత్ మీటర్లు మంజూరు చేస్తున్నామని, ఇప్పటి వరకు కర్నూలు గృహాలకు 550, ఆదోనిలో 350, నంద్యాలలో 150 కనెక్షన్లు ఇచ్చినట్లు చెప్పారు. త్వరలో నంద్యాలో కూడా మేళా నిర్వహించ నున్నట్లు తెలి పారు. అన్ని ఫిర్యాదుల కోసం విద్యుత్ పంపిణీ సంస్థ తెచ్చిన 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేస్తే పరిష్కారం లభిస్తుందని సూచించారు.

కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న పెరుగు విజయవర్ధన్‌రెడ్డి

గీతాంజలి నర్సింగ్ విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

డాక్టర్ వైఎస్ఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(విజయవాడ) వారు 2021- 2022 వ బ్యాచ్ బిఎస్‌సి నర్సింగ్ కోర్సు పరీక్షా ఫలితాలను వెల్లడించినారు. ఈ ఫలితాలలో కర్నూలు నగరం గాయత్రి ఎస్టేట్స్‌లోని గీతాంజలి నర్సింగ్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. వరుసగా 16 మంది డిస్టిక్షన్, 90మంది ఫస్ట్ క్లాస్ , ఏడుగురు సెకండ్ క్లాస్ సాధించినారు. కలశాలలో 90 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ పెరుగు విజయ్ వర్ధన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ వసంత కుమారి, కళాశాల ఉపాధ్యాయ బృందం అర్చన, వై.శిరీష, టి.శిరీష, సౌజన్య,సురేఖ, నిర్మల, జ్యోతి తేజస్విని కోర్సు ముగించుకొన్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

గీతాంజలి నర్సింగ్ కళాశాలలో అంతర్జాతీయ నర్సెస్ డే

కర్నూలు నగరం గాయత్రి ఎస్టేట్స్‌లోని గీతాంజలి నర్సింగ్ కళాశాలలో శుక్రవారం ఫ్లోరెన్స్ నైటింగేల్ 1203 వ జన్మదినాన్ని పురస్కరించుకొని అందర్జాతీయ నర్సింగ్ డేను ఘనంగా నిర్వహించినారు. ఈ ఉత్సవానికి కళాశాల కరస్పాండెంట్ పెరుగు విజయవర్ధన్ రెడ్డి కేకును కట్ చేసి కళాశాల సిబ్బందికి పంచారు. నర్సింగ్ విద్యార్థులకు, కళాశాల సిబ్బందికి నర్సింగ్ డే శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ వసంత కుమారి, అధ్యాపకులు నర్సింగ్ డేను ప్రతి నర్సింగ్ విద్యార్థి గౌరవించాలని పిలుపును ఇచ్చినారు.

పని ప్రదేశంలో సౌకర్యాలను కల్పించాలి

ప్రజాశక్తి-తుగ్గలి

కూలీలతో మాట్లాడుతున్న శ్రీరాములు

జాతీయ ఉపాధి హామీ చట్టం ద్వారా కూలీలకు పాత పద్ధతుల్లో పనులు కల్పించి, పనులు చేస్తున్న దగ్గర సౌకర్యాలను కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శ్రీరాములు కోరారు. శుక్రవారం మండలం పరిధిలోని జొన్నగిరి, దేశాయి తాండాల్లో జరుగుచున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతియ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. ఇప్పటికే పనుల శాతం భారీగా తగ్గిందన్నారు. కేవలం ఒక గ్రామ పంచాయతీకి 20 వర్క్ ఐడీలు మాత్రమే ఇచ్చారన్నారు. దీంతో కూలీలు పనులు చేయడానికి ఇబ్బందికరంగా మారిందన్నారు. పనులు దగ్గర సౌకర్యాలు లేకపోవడంతో చాలామంది కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తాగునీటి, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, తదితర సౌకర్యాలు లేవన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి పై ఇప్పటికీ కోత కోసిందన్నారు. సమస్యలపై ఈనెలలోనే కలెక్టరేట్ దగ్గర ఉపాధి కూలీలతో జరిగే ధర్నాకు భారీగా తరలి రావాలని కోరారు.

రాయలసీమ వర్సిటీకి వేసవి సెలవులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ , పీజీ కళాశాల విద్యార్థులకు వేసవి సెలవులను ఈనెల 31 వరకు ప్రకటిస్తూ వర్సిటీ సిడిసి డీన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 1 నుండి యధావిధిగా విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయన్నారు. వర్సిటీకి సెలవులను ప్రకటించడం పట్ల గవర్నమెంట్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నాగన్న, శ్రీనివాసులు, అధ్యాపక సంఘం నాయకులు సోమశేఖర్లు హర్షం వ్యక్తం చేశారు.

మోడల్‌లో ప్రవేశానికి జూన్ 11న పరీక్ష

ప్రజాశక్తి- సి బెళగల్ : ఈ ఏడాది విద్యా సంవత్సరం నుండి మోడల్‌లో సీట్ల ఎంపికలో లాటరీ పద్ధతి లేదని ఆ స్థానంలో ప్రభుత్వం ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు మోడల్ ప్రిన్సిపల్ వంశీమోహన్ పేర్కొన్నారు. ఈ నెల 25 వరకు గడువు ఉందని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఎస్‌సి, ఎస్‌టిలు రుసుం రూ 75, ఇతరులతే రూ 150 చెల్లించాలని అన్నారు. అలాగె వచ్చే నెల 11న ప్రవేశ పరీక్షలో పాల్గొని ఉత్తిర్ణత సాధించాలని ఆపై మెరిట్ ఆధారంగా సీట్ల ఎంపిక ఉంటుందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు.

హాస్పిటల్‌లో నర్సులు లేనిదే సేవలు సాగవు

మెడికవర్‌లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

హాస్పిటల్‌లో వైద్యం అందించడంలో నర్సులు లేనిదే సేవలు ముందుకు సాగవని మెడికవర్ హాస్పిటల్స్ వైఎస్ ప్రెసిడెంట్ డాక్టర్ వై.మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మెడికవర్ హాస్పటల్స్, కర్నూలు వారి ఆధ్వర్యంలో 'నర్సింగ్ డే " ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ టివి.సునీల్‌యాదవ్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వై .మహేశ్వరరెడ్డి , సెంటర్ హెడ్ పి.నీలారెడ్డి , మెడకవర్ హాస్పిటల్స్ నర్సులు, మెడికవర్ సిబ్బంది దాదాపు 300 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఆస్పత్రుల్లో నర్సులు లేనిదే ఎలాంటి వైద్య సేవలు కొనసాగవు అంటే ఆశ్చర్యం లేదన్నారు. ఇక అలాంటి నర్సులు నేడు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. డాక్టర్ టివి సునీల్ యాదవ్ మాట్లాడుతూ ఎవరైనా, ఎలాంటి అనారోగ్యం అయినా సరే ఆస్పత్రిలో చేరిన నాటి నుండి ఆరోగ్యంగా కోలుకునే వరకు నిరంతరం చేస్తున్న కృషి వర్ణనాతీతమన్నారు. వైస్ ప్రసిడెంట్ డాక్టర్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కరోనా అనగానే అల్లంత దూరం పారిపోయే కుటుంబ సభ్యులున్న రోజుల్లో కరోనా రక్కసి చేతిలో విలవిలలాడుతున్న వారికి నర్సులు అందించిన సేవలు ఎనలేనివి అని కొనియాడారు. కుల-మత విబేధాలు లేకుండా, పేద-ధనిక తేడా చూడకుండా, సేవా నిరతితో రోగులకు మేమున్నామంటూ నర్సులు సేవలు అందిస్తున్నారన్నారు.

33 శాతం సబ్సిడీతో ఎరువులు, మందులు సిద్ధం : ఎఒ

ప్రజాశక్తి-సి బెళగల్

అన్ని రైతు భరోసా కేంద్రాలలో 33శాతం సబ్సిడీతోనే ఎరువులు, మందులు సిద్ధంగా ఉంచామని ఎఒ మల్లేష్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమీక్షలో మాట్లాడారు.ఇక్కడే జిప్సంను 100 శాతం సబ్సితో ఇవ్వాలని అలాగే వ్యవసాయం పనిముట్లను అర్హులైన రైతులందరికి ఇవ్వాలని సలహా మండలి సభ్యులు అధికారులను కోరారు. ఆ ప్రకారమే నివేదికలు పంపిస్తామని ఎఒ మీడియాకు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచుదాం

- ఆదోని గ్రీనరీ డెవలెప్‌మెంట్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు, అడ్వకేట్ లలితమ్మ

ప్రజాశక్తి - ఆదోని

మొక్కలు పంపిణీ చేస్తున్న లలితమ్మ

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాల్సిన అవశ్యకత ఉందని ఆదోని గ్రీనరీ డెవలెప్‌మెంట్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు, అడ్వకేట్ లలితమ్మ సూచించారు. శుక్రవారం శ్రీమహాయోగి లక్ష్మమ్మవ్వ జాతర సందర్భంగా ఎజిడిఓ, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా భక్తులకు 300 మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చెట్ల ఆకులు వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్, సూక్ష్మ ధూళి కణాలను గ్రహించి ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయని తెలిపారు. మనం పీల్చే గాలిలో ఆక్సిజన్ మోతాదు పెరుగుతుందన్నారు. చెట్లు ఎయిర్ ఫిల్టర్లుగా పని చేస్తాయని అందరూ గ్రహించాలని తెలిపారు. చెట్లు చల్లదనాన్ని ఇవ్వడం ద్వారా విద్యుత్ వంటి ఇంధనాన్ని ఆదా చేస్తాయన్నారు. కాలుష్య ఉద్గారాలను బాగా తగ్గిస్తాయని చెప్పారు. వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వినీత, సెక్రటరీ కె.హరిత, ట్రెజరర్ కోమల, సభ్యులు శ్రీధర్, లక్ష్మీదేవమ్మ, కిరణ్మయి, ఎన్ఎస్ఎస్ డివిజన్ అధికారి జోనాథన్ విక్లీఫ్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్‌టిసి పరిధిలోని ఖాళీ స్థలాల లీజుకు టెండర్ల ఆహ్వానం

ప్రజాశక్తి - మంత్రాలయం

అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని ఆర్‌టిసి బస్ స్టేషన్ ఆదోని ఆర్‌టిసి బస్ స్టేషన్ పరిధిలోని ఖాళీ స్థలాలను 15 ఏళ్లకు లీజుకు ఇచ్చేందుకు ఔత్సాహికులైన వ్యాపారులకు టెండర్ల ద్వారా ఆహ్వానం పలికారు. శుక్రవారం కర్నూలు రీజనల్ మేనేజర్ వెంకట్రామం ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టిసి బస్ స్టేషన్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మంత్రాలయంలోని ఆర్‌టిసి బస్టాండ్ పరిధిలోని రెండు స్థలాల్లో 1.84 ఎకరాలు, ఒక ఎకరా స్థలం ఉందని తెలిపారు. మొత్తం 2 ఎకరాల 84 సెంట్లు, ఆదోని ఆర్‌టిసి బస్ స్టేషన్ పరిధిలోని 1.30 ఎకరాల స్థలానికి టెండర్లు ఆహ్వానించినట్లు చెప్పారు. పూర్తి సమాచారం కోసం www.apsrtc.ap.gov.inలో చూడాలని కోరారు. లేదా ఆదోని డిపో మేనేజర్, సెల్ ఫోన్ నెంబర్‌కు కానీ, ఎమ్మిగనూరు డిపో మేనేజర్ సెల్ ఫోన్ నెంబర్‌కు కానీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కర్నూలు వారి సెల్ ఫోన్ నెంబర్‌కు 9959225797, 9959225796, 9959166566 నెంబర్లకు సంప్రదించగలరని తెలిపారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు ఏ విధంగా టెండర్లు వేసుకోవాలి, దరఖాస్తులు చేసుకునే విధానం, విధి విధానాలు ఎలా ఉంటాయనే అంశాలను వివరించారు. స్థలాలు లీజుకు అవసరమైన వారు ఈనెల 23న మధ్యాహ్నం 2 గంటల్లోపు కడపలోని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయానికి దరఖాస్తులు అందించాలని సూచించారు. కడప చీఫ్ డిప్యూటీ కమర్షియల్ మేనేజర్ రమేష్ బాబు, సివిల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర్ రావు, ఎమ్మిగనూరు డిపో మేనేజర్ నాగభూషణం, సిఐ నాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక వివాహాలు

- ఏకమైన 32 జంటలు

ప్రజాశక్తి - కౌతాళం

వధూవరులను ఆశీర్వదిస్తున్న నాయకులు

వేద మంత్రాలు, భాజాభజంత్రీలు, గ్రామ పెద్దలు, రాజకీయ నాయకుల సందడితో నూతన వధూవరులు ఏకమయ్యారు. ఈ పెళ్లి సందడి మండలంలోని మధిర, పొదలకుంట గ్రామాల్లో చోటుచేసుకుంది. శుక్రవారం గ్రామంలోని ఉటగనూరు తాత మఠం దగ్గర పంపా రెడ్డి తాత ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వధూవరులకు టిడిపి మంత్రాలయం నియోజకవర్గం ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి తాళిబొట్టు, మెట్టలు అందజేశారు. ఈ సందర్భంగా సామూహిక వివాహాలకు ముఖ్య అతిథిగా హాజరైన టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు చెన్న బసప్ప, రైతు సంఘం రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు అడివప్ప గౌడ్, వెంకటపతి రాజు, టిడిపి నాయకులు కొట్రేష్ గౌడ్, రాజానందు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. టిడిపి మండల కన్వీనర్ ఉలిగయ్య నూతన జంటలను ఆశీర్వదించారు. వైసిపి రాష్ట్ర యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి, మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, బిజెపి జిల్లా నాయకులు డాక్టర్ పార్థసారథి సామూహిక వివాహాల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వివిధ మఠాల పీఠాధిపతులు పాల్గొన్నారు.

రోగాలు వస్తున్నా... పట్టించుకోరా.?

- బోరు నీరు తాగడం వల్ల ప్రజలకు రోగాలు...

ప్రజాశక్తి - హోళగుంద

రంగు మారిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నీరు

బోరు నీరు తాగడం వల్ల తమకు రోగాలు వస్తున్నాయని, పట్టించుకోరా అని హోళగుంద ఈబీసీ కాలనీ వాసులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. తమ కాలనీలో ప్రతి ఒక్కరికీ అలర్జీ, ఒంటి నిండా దద్దుర్లు, వాంతులు, కీళ్ల నొప్పులు, జ్వరాలతో బాధపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ఎల్‌సి కాలువ పక్కనే ఉన్నా తమ కాలనీ వాసులకు బోరు నీరు సరఫరా చేయడం పంచాయతీ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఏప్రిల్ 15 వరకు ఎల్ఎల్‌సి కాలువ నిండుకుండలా ప్రవహించినా తమకు తాగునీరు సరఫరా చేయడం లేదన్నారు. తమ సమస్యపై పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దుర్వాసన వెదజల్లుతున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు

సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు దుర్వాసన వెదజల్లుతోంది. మండల ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పదేళ్ల క్రితం కడ్లేమాగి రస్తాలో రూ.54 కోట్లు వెచ్చించి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. నిర్మాణం చేపట్టి వాడకంలోకి తెచ్చారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును శుభ్రంగా ఉంచడంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, పంచాయతీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లోపల పిచ్చి మొక్కలు, పాచి ఉండడమే కాకుండా తెల్లగా ఉండాల్సిన నీరు రంగు మారి పచ్చగా కనబడుతోంది. ఈ నీటిని విడుదల చేయడం వల్ల రోగాల బారిన పడుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు.

సమస్యను ఎంపిడిఓ దాస్ నాయక్ దృష్టికి తీసుకెళ్లగా... పంచాయతీ అధికారులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, ఆరోగ్య శాఖ సిబ్బందితో కలిసి బోరు వాటర్ విడుదల చేసే ఈ బీసీ కాలనీలో పర్యటించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును కూడా పరిశీలిస్తామన్నారు.

పూజలు నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

లక్ష్మమ్మవ్వ సన్నిధిలో సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పట్టణంలో శ్రీమహాయోగి లక్ష్మమ్మవ్వ ఆలయానికి శుక్రవారం ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సతీమణితో విచ్చేసి లక్ష్మమ్మవ్వను దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, ఆయన సతీమణి శైలజమ్మ, వైసిపి యువ నాయకులు మనోజ్ రెడ్డి కుటుంబం అవ్వను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడారు. శ్రీమహాయోగి లక్ష్మమ్మవ్వ చేసిన సేవలను స్మరించుకుని, పట్టణ ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జాతరను జరుపుకోవాలని తెలిపారు. అనంతరం భక్తులకు సబ్ కలెక్టర్ దంపతులు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

- ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని ఎమ్మిగనూరు సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కృష్ణ కాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఎమ్మిగనూరు సెబ్ సిఐ జయరామ్ నాయుడు ఆధ్వర్యంలో నందవరం మండలం హాలహర్వి గ్రామం వద్ద ప్రధాన రోడ్డుపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఒక ఆటోలో 12 మద్యం బాక్సుల్లో తరలిస్తున్న 1152 టెట్రా ప్యాకెట్లను పట్టుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.60 వేలు ఉంటుందని జయరామ్ నాయుడు తెలిపారు. మద్యాన్ని తరలిస్తున్న మంత్రాలయం మండలం వగరూరు గ్రామానికి డ్రైవర్ చిక్కిం యాకోబు, రాయచూరు తాలూకా గుంద్రేవుల గ్రామానికి చెందిన గుడిసె భీమన్నను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. సెబ్ ఎస్ఐ సోమశేఖర్ రావు, హెడ్ కానిస్టేబుల్ గోపాల్, లింగ ప్రసాద్, చంద్ర మౌళి, కానిస్టేబుల్ నరసింహ రెడ్డి, రాధమ్మ పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో జరిగిన వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. శుక్రవారం హెచ్‌ఆర్‌బి కళ్యాణ మండపంలో ఈడిగ కృష్ణవేణి, రవిగౌడ్‌ల కనిష్ట పుత్రుడు ఈడిగ వినయ్ గౌడ్, కీర్తి వివాహ వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఆయనను రవిగౌడ్‌తో పాటు భూరమణ కళ్యాణ మండపంలో జరిగిన మరో పెళ్లి వేడుకల్లో పెళ్లి పెద్దలు శాలువాతో పూలమాల వేసి ఘనంగా స్వాగతం పలికారు. పౌరోహితుల వేదమంత్రాలు, మంగళకర వాయిద్యాల నడుమ ఒక్కటైన జంటలను తలంబ్రాలతో ఆశీస్సులు అందించారు. సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, నాయకులు జనార్ధన్ రెడ్డి, శివ, నరసింహ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా...

ముఖ్యమంత్రి సహాయ నిధి

- ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల ఆరోగ్యానికి ఆర్థిక భరోసాగా నిలుస్తోందని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక స్వగృహంలో బాధితులకు చెక్కులు అందజేసి ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మొత్తం రూ.10.20 లక్షల చెక్కులను పంపిణీ చేశామని తెలిపారు. కార్వన్‌పేటకు చెందిన నరసింహులు కాళ్లకు ఆపరేషన్ చేయించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.4.20 లక్షలు అందించినట్లు చెప్పారు. పెద్దతుంబలం గ్రామానికి చెందిన జంగాల రంగమ్మకు చర్మం కాలిపోగా రూ.1.40 లక్షలు, ప్రశాంత్ నగర్‌కు చెందిన చంద్ర లివర్ వ్యాధితో చనిపోగా చంద్ర భార్యకు రూ.3.20 లక్షల చెక్కును అందించినట్లు తెలిపారు. మరాఠి గేరికి చెందిన బండి చాంద్ కాళ్లకు ఆపరేషన్ చేయించగా రూ1.20 లక్షలు, పెద్దహరివాణం గ్రామానికి చెందిన గర్జప్ప కడుపుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతుండగా రూ.20 వేలు మంజూరు చేయించినట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఎలాంటి వ్యాధికైనా ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రిలో కూడా ప్రజలకు చికిత్స చేసుకోవడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అవకాశం కల్పించారని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు. ఎవరైనా ఆరోగ్యశ్రీ లేని వ్యాధులకు చికిత్స చేసుకున్న తర్వాత అయిన ఖర్చులకు సంబంధించిన బిల్లులను నెలలోపు ఇవ్వడానికి ప్రయత్నించాలని కోరారు. 2024లో కూడా జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ మధుసూదన్, వైసిపి సీనియర్ నాయకులు మురళీ రెడ్డి, నగరూరు చంద్రశేఖర్ రెడ్డి, ఆర్‌టిసి రెహమాన్, ఇదాయత్, బాబు, నాగరాజు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

గ్రామీణ ప్రాంత రోడ్లపై దృష్టి పెట్టండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రామాంజనేయులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గ్రామీణ ప్రాంత రోడ్ల దుస్థితిపై కలెక్టర్, ఆర్‌అండ్‌బి ఎస్సీ దృష్టి పెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో గ్రామీణ ప్రాంత రోడ్లు పూర్తి అధ్వాన స్థితికి చేరాయని తెలిపారు. ఏడాది క్రితం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలోని రోడ్లకు మరమ్మతులు చేస్తామని హామీఇచ్చారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సుల్లో ప్రయాణించాలంటే కూడా అధ్వానంగా ఉందన్నారు. ఎమ్మిగనూరు నుంచి కోసిగి, ఎమ్మిగనూరు నుంచి పోలకల్, గుడికల్ గ్రామంలో ఇరుకైన రోడ్లు, ట్రాఫిక్ అంతరాయంగా మారుతోందని చెప్పారు. ఎమ్మిగనూరు నుంచి చిన్నహుల్తి, పట్టణంలో బైపాస్ రోడ్డు పనులు వేగవంతం చేయాలని కోరారు. కొత్త రోడ్లు వేసేందుకు బడ్జెట్ కేటాయించాలని, ఆర్‌అండ్‌బి అధికారులు, జిల్లా అధికారులు, జిల్లా పాలకులు పట్టించుకోవాలని కోరారు. సిపిఎం తాలూకా, పట్టణ నాయకులు హనుమంతు, రాముడు, నరసింహులు, అబ్దుల్లా, పి.రాజు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు భాగస్వామ్యం కల్పిస్తాం

- సర్వసభ్య సమావేశంలో అధికారులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగే ప్రజా సంక్షేమ, అభివృద్ధి, అధికారిక కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులైన సర్పంచులు, ఎంపిటిసిలకు ప్రాధాన్యత ఇచ్చి భాగస్వామ్యం కల్పిస్తామని గోనెగండ్ల ఎంపిపి నసురుద్దీన్, తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఒ నగేష్ తెలిపారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో గోనెగండ్ల మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు వల్ల నేరుగా అధికారులకే లబ్ధి అందజేస్తున్నందున స్థానిక ప్రజా ప్రతినిధులైన తమకు ప్రాధాన్యత కొరవడిందని కొంతమంది సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి, అధికారులు మాట్లాడారు. ఆయా గ్రామాల పరిధిలో జరిగే ప్రజా సంక్షేమ, అభివృద్ధి, అధికారిక కార్యక్రమాలకు ఎంపిటిసిలు, సర్పంచులకు ప్రాధాన్యత ఇచ్చి నిర్వహించేలా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు.

వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు, కార్మికులు

స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

గోనెగండ్ల మేజర్ పంచాయతీలో పని చేస్తున్న స్వచ్ఛభారత్ పారిశుధ్య కార్మికులకు గత కొన్ని నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే వేతనాలు చెల్లించాలని సర్వసభ్య సమావేశంలో వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైసిపి యువజన నాయకులు టి.బందే నవాజ్ మాట్లాడారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేసి పరిశుభ్రంగా ఉంచే కార్మికులకు నెలల తరబడి వేతనాలు లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. వెంటనే వారికి వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైస్ ఎంపిపి వెంకటరామిరెడ్డి, ఎర్రబాడు కాశీరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

గ్రామంలో ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని కెవిపిఎస్ మండల కార్యదర్శి తిక్కప్ప కోరారు. శుక్రవారం మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో పర్యటించి ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాలుగు వారాలకు పైగా కూలిలు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. రోజుకు కూలి రూ.100 నుంచి రూ.150 దాకా పడుతుందని ఉపాధి కూలీలు వాపోతున్నారని చెప్పారు. కొన్నిచోట్ల హాజరు శాతంలో అవకతవకలు జరుగుతున్నాయని తెలిపారు. ఉపాధి కూలీల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని అన్నారు. అధికారులు స్పందించి ఉపాధి హామీ కూలీల సమస్యలపైనా, ఉపాధి కూలీలకు కనీస వేతనం పడేవిధంగా చూడాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉపాధి కూలీలను సమీకరించి సచివాలయ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక పరిశీలన

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని విద్య వనరుల కేంద్రంలో జగనన్న విద్యా కానుక కింద మండలానికి పంపిణీ అయిన యూనిఫారం వస్త్రాలను ఆదోని డిప్యూటీ డిఇఒ సుకుమార్ శుక్రవారం పరిశీలించారు. మొదటి విడత కింద మండలానికి చేరుకున్న పాఠ్యపుస్తకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ వినోద్ కుమార్ మాట్లాడుతూ... ఇంకా మండలంలోని విద్యార్థులకు బూట్లు, బ్యాగులు, నోటు పుస్తకాలు, డిక్షనరీలు రావాల్సి ఉందని తెలిపారు.

'రాష్ట్రంలో పాలన దుర్మార్గం'

ప్రజాశక్తి- దేవనకొండ

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం దుర్మార్గపు, ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తోందని బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి పార్థసారథి తెలిపారు. శుక్రవారం మండలంలోని పి.కోటకొండలో జరిగిన ఓ వివాహ వేడుకలో ఆయన పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. బిజెపి కృష్ణగిరి మండల ఉపాధ్యక్షులు గంగిరాయుడు పాల్గొన్నారు.

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన

బిజెపి ఎంపీని అరెస్టు చేయాలి

- దేశ రాజధానిలో ఆందోళన చేస్తున్న రెజ్లర్లపై మోడీ ప్రభుత్వ తీరు దారుణం

- డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న కోరారు. తమకు న్యాయం చేయాలని దేశ రాజధానిలో ఆందోళన చేస్తున్న రెజ్లర్లపై మోడీ ప్రభుత్వ తీరు దారుణమని, ఈనెల 18న దేశవ్యాప్తంగా ఆందోళనలకు కేంద్ర కమిటీ పిలుపునిచ్చిందని తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కెవిపిఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడారు. భారతదేశ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా విస్తరించేలా మహిళా రెజ్లర్లు ఒలింపిక్‌లో బంగారు, కాంస్య పతకాలు సాధిస్తున్నారని తెలిపారు. వారికి అండగా నిలవాల్సిన రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు, బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని, వారి సమస్యలను ఎవరు పరిష్కరించాలని ప్రశ్నించారు. క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనవరిలో ఆందోళనకు దిగితే ప్రభుత్వం కమిటీ వేసి విచారిస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. నాలుగు నెలలైనా పట్టించుకోకపోవడంతో కొద్ది రోజుల క్రితం ఏడుగురు మహిళా రెజ్లర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారని చెప్పారు. కోర్టు సైతం ఇది తీవ్రమైన ఆరోపణ అని, తక్షణమే ఢిల్లీ పోలీసులు స్పందించి చర్య తీసుకోవాలని ఆక్షేపించిందని తెలిపారు. అయినా బిజెపి ఎంపీని కాపాడడం కోసం ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, లైంగిక వేధింపులకు గురైన క్రీడాకారుణులపైనా, వారి కుటుంబ సభ్యులపైనా దౌర్జన్యాలకు, బెదిరింపులకు పాల్పడడం ఆర్థికంగా సహకరిస్తామని ఆశ పెట్టారని విమర్శించారు. ఆందోళన చేస్తున్న రెజ్లర్లపై పాశవికంగా దాడులకు పాల్పడటం దారుణమన్నారు. మోడీ ప్రభుత్వం రెజ్లర్ల ఆందోళనకు స్పందించి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్‌పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శిరీష, సురేష్, హుస్సేన్, జిల్లా కమిటీ సభ్యులు దాసు, మైనా, శ్రీకృష్ణ, గోవర్ధన్, అజిత్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వీరశేఖర్

'ఉపాధి' వద్ద సదుపాయాలు కల్పించాలి

- వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ

ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ కోరారు. రెండు పూటల హాజరును రద్దు చేయాలని, రూ.600 వేతనం పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని తెర్నేకల్, పాలకుర్తి గ్రామాల్లో వ్యకాస మండల కార్యదర్శి మహబూబ్ బాషతో కలిసి ఉపాధి పర్యటనలు నిర్వహించారు. ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వ్యకాస ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా వ్యవసాయ కూలీలను కూడగట్టి పోరాడడంతో ఉపాధి హామీ చట్టాన్ని సాధించుకున్నామని తెలిపారు. కేంద్రంలోని బిజెపి 9 ఏళ్ల పాలనలో నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని చెప్పారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకుండా చేస్తూ ఉపాధి హామీ పనులకు బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తున్నారని మండిపడ్డారు. ఉపాధి హామీ పనిని ఎత్తివేయడానికి రెండుసార్లు ఫొటో విధానాన్ని తీసుకొస్తున్నారని తెలిపారు. వేసవి అలవెన్స్ సవరిస్తూ పనుల దగ్గర వసతులను తగ్గిస్తున్నారని చెప్పారు. పని చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు మంజూరు చేయకుండా ఇతర వాటికి మళ్లిస్తూ ఉపాధి కూలీల కడుపులు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీకి నిధులు పెంచాలని, ఆన్‌లైన్ ద్వారా రెండుసార్లు ఫొటో యాప్‌ను రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని కోరారు. పే స్లిప్పులు ఇవ్వాలని, రవాణా చార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని చేసే చోట టెంటు, మెడికల్, ఒఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని, ప్రమాద బీమా కొనసాగించాలని కోరారు. కొత్త పనిముట్లు ఇవ్వాలని, జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికీ 200 రోజులు పని దినాలు కల్పిస్తూ ఒక్కొక్కరికి రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని కోరే వారందరికీ పని కల్పించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈనెల 22న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉపాధి కూలీలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. దొడ్డప్ప, తిమ్మప్ప, నబీ, శివ, ఈశ్వర్ రెడ్డి, మల్లికార్జున, చిన్న తిక్కప్ప, వెంకట్రాముడు, లక్ష్మీ, పద్మావతి, రంగమ్మ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

జూన్ మాసం పత్తి సాగుకు అనుకూలం

- వ్యవసాయ సహాయ సంచాలకులు గిరీష్

ప్రజాశక్తి - పెద్దకడబూరు

పత్తిని సాగు చేసేందుకు జూన్ మాసం అనుకూలమైందని ఆదోని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.గిరీష్ తెలిపారు. శుక్రవారం పెద్దకడబూరులోని రైతు భరోసా కేంద్రంలో ఎఒ వరప్రసాద్ ఆధ్వర్యంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరీష్, సలహా మండలి సభ్యులు, పెద్దకడబూరు గ్రామ వ్యవసాయ సహాయకులు శ్వేత, ఇందు మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో అవసరమయ్యే విత్తనాలు, ఎరువులు రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించడానికి ఈనెల 15 నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభమవుతుందని తెలిపారు. భూ యజమాని తన పొలం సాగు చేసుకునే కౌలుదారులకు కౌలు పత్రం పొందడానికి అవసరమయ్యే అంగీకార పత్రంపై సంతకం చేసి కౌలు రైతులకు సహకరించాలని కోరారు. పత్తి విత్తనాలు నాటుకోవడానికి మే నెల అనుకూలమైందని కాదని, జూన్‌లో నేల పూర్తిగా చల్లబడిన తర్వాత మాత్రమే విత్తనాలు నాటుకోవాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలకొల్పాల్సిన ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లో రైతులు ఉచితంగా విత్తన పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. రైతులు పండించిన సొంత విత్తనం కానీ, విత్తన దుకాణాల్లో కొన్నా పరీక్ష నిమిత్తం ఆదోనిలోని పరీక్ష కేంద్రానికి పంపవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి సంబంధిత రైతు భరోసా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలన్నారు. అనంతరం ఎఒ వరప్రసాద్ మాట్లాడారు. ఈనెల చివరి వారంలో విడుదలయ్యే రైతు భరోసా లబ్ధిదారులు జాబితా కోసం ఆర్‌బికె సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. సామాజిక తనిఖీ నిమిత్తం జాబితా ప్రదర్శిస్తామన్నారు. ఏమైనా సమస్యలుంటే ఈనెల 15లోపు తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న గిరీష్

భక్తులకు తాగునీరు సరఫరా

ప్రజాశక్తి - పెద్దకడుబూరు

ఆదోనిలో వెలసిన మహాయోగి లక్ష్మమ్మవ్వ రథోత్సవం సందర్భంగా శుక్రవారం పెద్దకడబూరు గ్రామానికి చెందిన టిడిపి రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్‌రెడ్డి భక్తులకు తాగునీరు పంపిణీ చేశారు. శ్రీమహాయోగి లక్ష్మమ్మవ్వ రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వస్తున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని దాహార్తిని తీర్చేందుకు తాగునీటి కేంద్రం ఏర్పాటు చేశారు.

తాగునీటిని అందిస్తున్న నరవ

ఆదోని త్రీటౌన్ సిఐ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని త్రీ టౌన్ సిఐగా నరసింహారాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిఐ శ్రీరామ్‌ను కర్నూలు విఆర్‌కు బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఐ నరసింహారాజు మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుల సహకారంతో అహర్నిషలు కృషి చేస్తామన్నారు. కర్నూలు విఆర్ నుంచి ఉన్నతాధికారులు తనను ఇక్కడికి బదిలీ చేశారన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలు జరగకుండా నిఘా పెంచుతామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కూలీలతో మాట్లాడుతున్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరరావు

స్థి(గ)తి మారదు

- టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కరువు - నివాసానికి అనానుకూల వాతావరణం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వాలని టిడ్కో ఇళ్లు ఇచ్చినా ఉపయోగం లేని పరిస్థితి నెలకొంది. టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. నివాసానికి అనానుకూల వాతావరణం ఉండటంతో లబ్ధిదారులు వాటిలో ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు...

పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్న ఉద్దేశంతో టిడిపి ప్రభుత్వంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో టిడ్కో గృహాల పేరుతో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. తరువాత ప్రభుత్వం మారడంతో అవి అలానే ఉండిపోయాయి. వైసిపి ప్రభుత్వం వాటిని లబ్ధిదారులకు ఇచ్చేందుకు ఆర్బాటంగా కార్యక్రమాలు నిర్వహించింది. ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మొదలు పెట్టింది. నంద్యాల జిల్లా పరిధిలో నంద్యాలతో పాటు ఆళ్లగడ్డ, డోన్‌లో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. నంద్యాలలోని నందమూరి నగర్‌లో 3,904 ఇళ్లు, అయ్యలూరి మెట్ట దగ్గర 2,272 ఇళ్లు, ఎస్ఆర్‌బిసి కాలనీలో 3,824 ఇళ్లను నిర్మించారు. ఆళ్లగడ్డలో చింతకుంట గ్రామ శివార్లలో 1,296 ఇళ్లు, డోన్‌లో హైవే సమీపంలో 306 ఇళ్లను కట్టించారు. ఎక్కడా కూడా లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఈ ఇళ్లకు విద్యుత్, మంచినీటి సైకర్యం, రోడ్లు, డ్రైనేజీ వంటివి ఏర్పాటు చేయలేదు. ఇళ్లు కూడా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పూర్తి అయిన ఇళ్లను కరోనా సమయంలో క్వారంటైన్ కేంద్రాల కోసం ఉపయోగించడంతో ప్రస్తుతం అవి నివాసానికి అనుకూలంగా లేవు. టిడ్కో గృహాలు నివాసానికి అనుకూలంగా లేకపోవడంతో లబ్ధిదారులు వాటిలో నివాసం ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు.

ప్రభుత్వం టిడ్కో గృహాల పేరుతో ఇళ్లను కేటాయించినా వాటిలో మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు వెళ్లకపోవడంతో అద్దె ఇళ్లే దిక్కవుతున్నాయి. నెలకు రూ.4 నుంచి రూ.5 వేల ఇంటి అద్దె కట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మరో వైపు టిడ్కో గృహాలకు బ్యాంకులు ఇచ్చిన రుణాలను కూడా కొందరు లబ్ధిదారుల నుంచి వసూలు చేస్తుండటంతో ఆయా లబ్ధిదారులకు భారం రెట్టింపవుతోంది.

పాత పద్ధతిలో 'ఉపాధి' కొనసాగించాలి

- వ్యకాసం, ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - నందికొట్కూర్

ఉపాధి హామీ పనులను పాతపద్ధతిలో కొనసాగించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం జూపాడు బంగ్లా మండలం లోని మల్లెం గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల దగ్గరకు మండల కార్యదర్శి ఎం కర్ణ, రైతు సంఘం నాయకులు శివమణి, షాహిద్ బాషలతో కలిసి వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. పనులు చేసిన బిల్లులు రావడం లేదని, రెండు సార్లు ఫోటో తీయడం ఇబ్బందికరంగా ఉందని, వేసవి అలవెన్స్ రావడంలేదని, పారాకు చదును చేయించుకోవడానికి డబ్బులు రావడంలేదని, తదితర సమస్యలు వారికి వివరించారు. అనంతరం ఎం నాగేశ్వరరావు, ఎం కర్ణ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ కూలీలను దేశవ్యాప్తంగా కూడగట్టి తిండి అయినాపెట్టాలి పనైనా చూపాలి అని పెద్ద ఎత్తున పోరాడిన ఫలితముగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సాధించుకోవడం జరిగినదని అన్నారు. ఉపాధి హామీ పనులకు బడ్జెట్లో నిధులు తగ్గిస్తూ ఉపాధి హామీ పనిని ఎత్తివేయడానికి రెండుసార్లు ఫోటో విధానాన్ని, వేసవి అలవెన్స్‌లను సవరించిందని ఆరోపించారు. ఈనెల 15వ తేదీన నంద్యాల జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద పెద్ద ఎత్తున మహా ధర్నా కార్యక్రమం జరుగుతుందని ఈ ధర్నా కార్యక్రమానికి ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు తెలిపారు. ప్లే షిప్పు, రవాణా చార్జీలు ఇవ్వాలని, పనిచేసే చోట టెంటు సౌక్యరం,

తరువాయి 6లో..

కష్టాలు వింటూ..హామీలిస్తూ..

- యువగళం పాదయాత్రకు నీరాజనాలు - శ్రీశైలం నియోజకవర్గంలోకి ప్రవేశించిన యాత్ర

ప్రజాశక్తి-పాములపాడు/ఆత్మకూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర శుక్రవారం నందికొట్కూరు నియోజకవర్గంలోని పాములపాడు మండలంలో సాగి శ్రీశైలం నియోజకర్గం ఆత్మకూరు మండలంలోకి చేరుకుంది. నారా లోకేష్‌కు జనం నీరాజనాలు పలికారు. దారిపొడవునా ప్రజలు యువనేతకు నీరాజనాలు పడుతూ తాము ఎదుర్కొంటున్న కష్టాలు చెప్పుకున్నారు. మరో ఏడాదిలో రాబోయే చంద్రన్న ప్రభుత్వం అందరి కష్టాలు తీరుస్తుందని చెప్పి యువనేత ముందుకు సాగారు. బన్నూరు క్యాంప్ సైట్ నుంచి ప్రారం భమైన పాదయాత్ర కృష్ణారావుపేట, రుద్రవరం, పాములపాడు, కంభాలపల్లి, ఎర్రగూడూరు మీదుగా శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రవేశించింది. శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గ శివార్లలో యువనేతకు అపూర్వ స్వాగతం లభించింది. శ్రీశైలం ఇన్ చార్జి బుడ్డా రాజశేఖర్ రెడ్డి, సీనియర్ నేత ఏరాసు ప్రతాపరెడ్డి, పార్టీనాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున యువనేతకు ఎదురేగి స్వాగతం పలికారు. పాములపాడులో ఎస్సీలతో సమావేశమైన యువనేత లోకేష్ వారి సాధక బాధకాలను తెలుసుకున్నారు. వివిధ గ్రామాల ప్రజలు, రైతులు, మైనారిటీలు యువనేతకు ఎదురేగి తమ సమస్యలను తెలియజేశారు. తుమ్మలూరు గ్రామ రైతులు యువనేత లోకేష్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కేసీ కెనాల్ 102 తూము దగ్గరి నుండి పోతిరెడ్డిపాడు వరకు పంట కాలువకు సైడు కాలువ నిర్మాణం చేపట్టాలని, రైతులకు ఏటా కాల్వలో గడ్డి తీయడానికి రూ.1.5 లక్షలు ఖర్చు అవుతోందని, సొంత ఖర్చుతో పనులు చేసుకుంటున్నారని తెలిపారు. కృష్ణారావుపేటలో మహిళా వ్యవసాయ కూలీలను కలిసిన యువనేత లోకేష్ వారి సమస్యలను తెలుసుకున్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, కరెంట్ చార్జీలు, గ్యాస్ ధర పెరగడంతో వచ్చే కూలీ బ్రతకడానికి సరిపోవడం లేదని, ఎక్కువ రోజులు పనులు దొరక్క ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. జూటూరు గ్రామంలో ఉపాధి హామీ పథకంలో కాల్వగట్ల పనులు చేస్తున్న కూలీలను యువనేత లోకేష్ కలుసుకొని, వారి కష్టాలు తెలుసుకున్నారు. ఫేస్ రికగ్నేషన్ లేకపోతే డబ్బులు రావంటూ వేధిస్తున్నారని, గతంలో వేలిముద్ర వేస్తే సరిపోయేదని, మధ్యాహ్నం దాకా పనులు చేయించడం వల్ల ఇంటివద్ద పిల్లలకు భోజనం కూడా వండి పెట్టలేకపోతున్నామని కూలీలు లోకేష్‌కు వివరించారు. రుద్రవరం మైనారిటీలు లోకేష్‌ను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. కృష్ణారావుపేటలో పత్తిరైతును యువనేత లోకేష్ కలిసి ఆయన సాధకబాధకాలు తెలుసుకున్నారు. 3.5ఎకరాల్లో పత్తిపంట వేస్తున్నానని, నాలుగేళ్లుగా వరుస నష్టాలే వస్తున్నాయని, లక్షరూపాయలు ఖర్చవుతుంటే కనీసం పెట్టు బడులు కూడా రావడం లేదని రైతు సాయిబాబు తెలిపారు. 97వరోజు యువనేత లోకేష్ 16.5 కిలో మీటర్లు పాదయాత్ర చేశారు ఇప్పటివరకు 1239.5 కిలో మీటర్ల మేర పాదయాత్ర పూర్తయింది. శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గంలోని కె.స్టార్ గోడౌన్స్ వద్ద విడిది కేంద్రంలో యువనేత బసచేశారు. మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, ఎమ్మెల్సీ బిటి. నాయుడు, టిడిపి ఇంఛార్జి మాండ్ర శివానందరెడ్డి, కోడుమూరు ఇంఛార్జి ఆకెపోగు ప్రభాకర్, ఎస్సీ సెల్ నాయకులు ఎమ్మెస్ రాజు, నాయకులు బండి జయ రాజు, జయ సూర్య, రుద్రవరం ఎంపీటీసీ అరుణ, కాకరవాడ చిన్న వెంకటస్వామి పాల్గొన్నారు.

నారా లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్ రెడ్డి, తదితరులు

ఘన స్వాగతం..

శ్రీశైలం నియోజకవర్గంలోకి లోకేష్ అడుగు పెట్టిన మరుక్షణం నుండే శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పెద్ద ఎత్తున టిడిపి శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. రాత్రి నారా లోకేష్ కరివేన ఎస్సార్ బీసీ సమీపంలో అక్కడే ఉండి శనివారం ఉదయం జిల్లా టిడిపి నాయకులు తో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. భోజనం అనంతరం అక్కడి నుండి ఆయన పాదయాత్ర ప్రారంభించి ఎస్ఎన్ఆర్ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న బహిరంగ సభ వేదిక చేరుకొని సభలో ఆయన ప్రసంగించనున్నారు అనంతరం ఆత్మకూరు పట్టణంలో ఆయన పాదయాత్ర చేపట్టనున్నారు. నారా లోకేష్ కు ఘన స్వాగతం పలికిన వారిలో మాజీ న్యాయ శాఖ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి. శ్రీశైలం దేవస్థానం మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి. టిడిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కరీముల్లా, ఆత్మకూర్ టిడిపి అధ్యక్షుడు జెట్టి వేణుగోపాల్, ఇతర నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహిళలకు పథకాల బుక్‌లెట్‌ను ఇస్తున్న ఎమ్మెల్యే

సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి అన్నారు. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు నడిగడ్డలో 102వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కౌన్సిలర్ ఆరిఫ్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఉదయం 6.30 గంటల నుండి ఎమ్మెల్యే గడపగడప తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ కరపత్రాలను లబ్ధిదారులకు అందించారు. పథకాలను వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దకు పంపించడం ఎంతో సంతోషంగా ఉందని వార్డు ప్రజలు తెలియజేస్తున్నారని అన్నారు. స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని రాగా వాటిని ఎమ్మెల్యే అక్కడే ఉన్న మున్సిపల్ అధికారులకు తెలిపి వాటిని సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మున్సిపల్ చైర్పర్సన్ మాభూన్నిసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాము షావలి, నాయకులు పాల్గొన్నారు.

సెబ్ కార్యాలయానికి స్థలము కేటాయింపు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ సెబ్ కార్యాలయానికి రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సెబ్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు సెబ్ స్టేషన్ నిర్మాణం కోసం ఆళ్లగడ్డ తహశీల్దార్ హరినాథరావుకు ఆళ్లగడ్డ సెబ్ ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ చంద్రమణి విజ్ఞప్తి మేరకు తహసిల్దార్ సానుకూలంగా స్పందించి ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పడకండ్ల గ్రామ సర్వేనెంబర్ 174లో 968 స్క్వేర్ స్థలం కేటాయించారు.

సర్వే పనులు చేయకుండా వెళ్ళిపోవాలని హెచ్చరిస్తున్న రైతులు

గ్రామసభలు జరిపిన తర్వాతనే

భూ సేకరణ సర్వే చేపట్టండి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల నుండి జమ్మలమడుగు వరకు జాతీయ రహదారి 167-కె కు ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ సర్వే పనులను నంద్యాల మండలంలోని కానాల, రైతు నగరం గ్రామాల్లో గ్రామసభలు జరిపి, ఆ తర్వాతనే భూ సేకరణ పనులు చేపట్టాలని ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి రామచంద్రుడు, భూ సేకరణ నిర్వాసితుల కమిటీ నాయకులు సుబ్బారావు, శంకర్రావు, మనోహర్, చైతన్య డిమాండ్ చేశారు. శుక్రవారం కానాల, రైతు నగరం భూముల్లో సర్వే చేయడానికి వచ్చిన అధికారులను భాధిత రైతులు అడ్డుకొని వెనక్కి పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 167 కె జాతీయ రహదారి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గెజిట్ నోటిఫికేషన్‌లో కానాల, రైతు నగరం గ్రామాల్లో నిరుపేద రైతుల భూములు ఎక్కువగా కోల్పోయే విధంగా ఉందన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, భూస్వాముల, ధనవంతుల భూములు కాపాడే విధంగా ఉన్నదని ఆరోపించారు. అందువల్ల భూములు కోల్పోయిజీవనోపాధి కోల్పోతున్న రెండు గ్రామాల పేద రైతులు రైతు సంఘం ఆధ్వర్యంలో గత నెలలో దశలవారీగా ఆందోళనలు అధికారులను కలిసి వినతి పత్రాలు ఇవ్వడం, సర్వే అధికారులు అడ్డుకోవడం, తమ భూముల వద్దనే వంట వార్పుచేయడం, రాస్తారోకో చేయడం జరిగిందన్నారు. ఎంపిని అడ్డుకోవడం మొదలగు కార్యక్రమాలు చేయడం ద్వారా స్పందించిన ఎంపీ జిల్లా ఉన్నతాధికారులు, నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి తాత్కాలికంగా సర్వే పనులను ఆపివేయించారని,ఈ సందర్భంగా నే ఎంపీ ఉన్నతాధికారులతో మాట్లాడి గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. రైతులు కూడా తమ అభ్యంతరాలను హైవే అథారి టీకి జాతీయ మానవ హక్కుల సంఘాలకు రాతపూర్వకంగా విన్నమించు కున్నారని, నేషనల్ హైవే అధికారులు, తహశీల్దార్ గ్రామాల్లోకి వచ్చి కొంతమంది రైతులతో మాట్లాడి సర్వే పనులు మళ్లీ మొదలు పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి ప్రయత్నాలు మానుకోవాలని అన్నారు. దౌర్జన్యంగా తమ భూముల్లో భూ సేకరణ కోసం సర్వే పనులు మొదలుపెడితే అడ్డుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో గ్రామ సభ జరుపుటకు జిల్లా కలెక్టర్, ఎంపీ, నేషనల్ హైవే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. లేకుంటే రిలే నిరాహార దీక్షలు చెప్పడతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సిబ్బందితో మాట్లాడుతున్న డిహెచ్‌ఎం డాక్టర్ వెంకటరమణ

ఫ్రైడే- డ్రైడేను డిహెచ్‌ఎం తనిఖీ

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల పట్టణంలోని చాబోలు గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న ఫ్రైడే, డ్రై డే కార్యక్రమాన్నిజిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఆర్. వెంకటరమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సచివాలయ ఆరోగ్య కార్యకర్త, ఆశాలు ఫ్రైడే, ఫ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందిగా నిర్వహించాలని లేనిచో కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

104 సిబ్బంది డిమాండ్లను నెరవేర్చాలి

ప్రజాశక్తి - రుద్రవరం

తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని 104 సిబ్బంది పేర్కొన్నారు. శుక్రవారం నల్ల బ్యాడ్జీలుకి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బి ప్రశాంత్ మాట్లాడుతూ 104 వాహనంలో విధులు నిర్వహిస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్, డ్రైవర్స్‌కి ఉద్యోగ భద్రత కల్పించాలని, వాహన సేవలు రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని, పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని పేర్కొన్నారు.

నిరసన తెలుపుతున్న 104 సిబ్బంది

అక్రమ అడ్మిషన్లను అరికట్టాలి : ఐసా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు కొనసాగడాన్ని అరికట్టాలని ఐసా ఆధ్వర్యంలో స్థానిక ఐసా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో ఐసా జిల్లా కార్యదర్శి యస్.నాగార్జున డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే విద్యను అంగడి సరుకుల విక్రయిం చడానికి ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యం సిద్ధమైయ్యాయ న్నారు. జిల్లాలో ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా విద్యా ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా అడ్మిషన్లు చేసుకుంటున్నారన్నారు. అడ్మిషన్ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు ముక్కు పిండి వసూలు చేస్తున్న విద్యాశాఖ అధికారులు మాత్రం తమకు ఏమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారాని విమర్శించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు రంగస్వామి, ఐసా నాయకులు రాధాకృష్ణ, రాజ, తదితరులు పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్ల పంపిణీకి ప్రణాళిక

- జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిల్లాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోపు పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్య కానుక కిట్లను పంపిణీ చేసేందుకు పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిల్లాని సామూన్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని ఎస్పిజి హైస్కూలులోని మండల స్టాక్ పాయింట్‌ను, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న రెమిడీయల్ తరగతులను, అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఈ విద్యా సంవత్సరానికి సరఫరా చేసిన విద్యార్థుల యూనిఫామ్ దుస్తులను పత్రికా ప్రకటన భౌతిక కొలతల ప్రకారం వచ్చాయా లేదా అని పరిశీలించారు. పాఠ్యపుస్తకాలను క్రమ పద్ధతిలో క్లాసులవారిగా విభజించి సరఫరా చేయాలన్నారు. జూన్ 1 నుండి 12 తేదీ వరకు మండల స్టాక్ పాయింట్ల నుండి అన్ని పాఠశాలలకు విద్యా కానుక కిట్లను సరఫరా చేయాలన్నారు. అనంతరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రెమిడీయల్ తరగతులు జరుగుతున్న కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిరోజు అటెండ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఈఓను ఆదేశించారు. తదుపరి ఆత్మకూరు బస్టాండ్ రోడ్లోని అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ ఎలా చేస్తారని మెడికల్ ఆఫీసర్ ను ప్రశ్నించారు. ఐడి క్రియేషన్, కాల్స్ డేటా, క్యాలెండర్ మెయింటైన్ సంబంధిత రిజిస్టర్లు నిర్వహిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకుంటూ రికార్డులను పరిశీలించారు. ఈసీజీ మిషన్, ట్యాబ్స్ పనిచేస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది కొరత వల్ల టెస్టు చేయ డంలో ఇబ్బంది అవుతుందని మెడికల్ అధికారి కలెక్టర్‌కు నివేదించగా చర్య లు తీసుకోవాలని డిఎంహెచ్ వో డాక్టర్ వెంకటరమణను కలెక్టర్ ఆదేశించారు.

రెమిడియల్ తరగతులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

జిల్లా ఎస్పిని కలిసిన స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఇటీవల జరిగిన డిఎస్పీ బదిలీలలో రాజమండ్రి నుండి నంద్యాల జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా నియమితులైన జె.వి సంతోష్ బాధ్యతలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా శుక్రవారం నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డిని జిల్లా పోలీసు కార్యాలయంలో పుష్పగుచ్ఛంతో మర్యాద పూర్వకంగా కలిశారు.

ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డి.ఎస్.పి

నేడు కృష్ణయ్య శెట్టి జయంతి

ప్రజాశక్తి-డోన్

పట్టణంలోని మాకం వీధిలోని వాసవి కాంప్లెక్స్ పైన అవొపా కార్యాలయంలో శనివారం అవొపా ఫౌండర్ కృష్ణయ్య శెట్టి జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు అవొపా కార్యదర్శి జొన్నల గడ్డ శ్రీనివాసులు శెట్టి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవొపా సభ్యులు తప్పక పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అల్పాహారం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఐటిఐ అడ్మిషన్లకు దరఖాస్తులు

ప్రజాశక్తి - బేతంచెర్ల

అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐ యాజమాన్యాల కళాశాలల నందు ఐటిఐ చదవడానికి అడ్మిషన్ల కొరకు దరఖాస్తు చేసుకోవాలని ఐటిఐ ప్రిన్సిపల్ పి సురప్ప శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-2024 విద్య సంవత్సరంలో ఐటిఐ నందు చేరదలుచుకున్న విద్యార్థులు www.iti.ap.gov.in వెబ్సైట్ నందు దరఖాస్తు చేసుకోగలరని ఆయన అన్నారు. పూర్తి ఇతర వివరాలకు 99493 61066,96660 85561 ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించగలరు అని తెలిపారు.

శిల్పా సేవాసమితి ఆధ్వర్యంలో

సిపిఆర్‌పై శిక్షణ

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

శిల్పా సేవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నంద్యాల పట్టణంలోని సూరజ్ గ్రాండ్ హోటల్‌లో శిల్పా సేవాసమితి ఆధ్వర్యంలో ఫస్ట్ ఎయిడ్, సిపిఆర్‌పై సచివాల హెల్త్ సెక్రటరీలు, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బందికి శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి శిక్షకులు పలు సూచనలు సలహాలు తెలిపారు. ఈ శిబిరంలో హైదరాబాద్ నుండి వచ్చిన వైద్యులు ప్రవీణ్ కుమార్ రాథోడ్, శివరంజని సంతోష్ ఫస్ట్ ఎయిడ్, సిపిఆర్‌పై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి మాట్లాడుతూ అత్యవసర ప్రమాదాలు, గుండెపోటు సంభవించినప్పుడు వెంటనే స్పందించి వారి ప్రాణాలను రక్షించేందుకు ఫస్ట్ ఎయిడ్, సిపిఆర్ శిక్షణ ఉపయోగ పడుతుందని తెలిపారు. భాదితులు ఆసుపత్రికి వెళ్లే లోపు ప్రాణాలకు భరోసాను కల్పించవచ్చన్నారు. శిల్పా సేవా సమితి ఆధ్వర్యంలో సామాజిక బాధ్యతలో భాగంగా ఈ శిక్షణ శిబిరాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. వైద్యులు ప్రవీణ్ కుమార్ రాథోడ్, శివరంజని సంతోష్ సేవలను ప్రశంసించారు. మీ ప్రాంత పరిసరాలలో ఎక్కడైతే ప్రమాదాలు అత్యవసర సేవలు, గుండెపోటు సంభవించిన వారిని కాపాడేందుకు సచివాలయం హెల్త్ సెక్రెటరీలు, ఆశా వర్కర్లు వెంటనే స్పందించాలని ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి విలువైన ప్రాణాలను కాపాడాలని కోరారు. భవిషత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిపిఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రమాదాల నివారణకు పటిష్ట భద్రత : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో రహదారి ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైయస్సార్ సెంటినరీ హాలులో జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమీక్షా సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఫ్లైఓవర్ బ్రిడ్జి, బొగ్గులేన్ రోడ్డు, గూడ్స్ షెడ్, కలెక్టరేట్ తదితర గుర్తించిన 25 బ్లాక్ స్పాట్లలో మునిసిపల్, ఆర్ అండ్ బి, పోలీసు, రవాణా శాఖల సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లాలోని డోన్, నంద్యాల, చాగలమర్రి, అవుకు, జూపాడుబంగ్లా తదితర 29 బ్లాక్ స్పాట్లలో గుర్తించిన ప్రమాదకరమైన మలుపుల్లో స్పీడ్ బ్రేకర్లు, ప్రధాన హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు ఆర్ అండ్ బి ప్రతిపాదనల మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించే ద్విచక్ర వాహనదారులకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు కల్పించాలని ఆర్టీవో అధికారులను ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ ను పకడ్బందీగా అమలు చేయడంతో పాటు సంబంధిత వ్యక్తికి జైలు శిక్ష కాలాన్ని పెంచాలని కలెక్టర్ ఎస్పీని సూచించారు. 44వ జాతీయ రహదారి పుల్లూరు నుండి బెంగళూరు సరిహద్దు రోడ్డు వరకు ఆరు వరసల రహదారి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే స్పందించి సమాచారం అందించి ఆదుకునే వారికి ప్రభుత్వం పరంగా రూ.5 వేలు పారితోషికం ఇచ్చే విషయంపై ప్రచారం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర రహదారుల్లో పోలీసు, ఎన్హెచ్ అధికారులు జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి అవసరమైన ప్రదేశాల్లో నిఘా కెమెరాలు స్ట్రాటజీ స్థాయిలో పెంచి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారుల అధికారులను ఆదేశించారు. జిల్లాలో 2023 జనవరి నుంచి ఏప్రిల్ వరకు 192 రోడ్ ప్రమాదాలు జరగ్గా 104 మంది మరణించారని, 230 మంది స్వల్ప గాయలతో బయట పడ్డారని ఆర్‌టిఒ జి.వి. శివారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, పక్కన ఎస్పీ, తదితరులు

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యత

ప్రజాశక్తి - డోన్

వార్డులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. శుక్రవారం డోన్ పట్టణంలోని 26వ వార్డు నందు గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా వచ్చిన 10 లక్షల రూపాయల నిధులతో సిసిడ్రైన్,కల్వర్టు, సీసీరోడ్డు పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ డోన్ పట్టణంలో 16 సచివాలయాలకు గాను మూడు కోట్ల 20 లక్షల రూపాయలు గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా వచ్చాయని డోన్ పట్టణంలో 32 వార్డులకు సంబంధించి ఒక్కొక్క వార్డుకు 10 లక్షల రూపాయలు చొప్పున అభివృద్ధి పనులకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ఎండి జాకీర్ హుస్సేన్, వార్డు కౌన్సిలర్ రత్నమ్మ, నంద్యాల జిల్లా డీసీ అధ్యక్షుడు పోస్ట్ ప్రసాద్,మహేష్ రెడ్డి,దివి రెడ్డి, గోపిరెడ్డి,వందు,కాంట్రాక్టర్ గోవిందరాజులు పాల్గొన్నారు.

విస్తృతంగా దిశ యాప్ డౌన్లోడ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో దిశ యాప్ డౌన్లోడ్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం విస్తృతంగా చేపట్టారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని అధికారులు పోలీస్ సిబ్బంది గ్రామ,వార్డు మహిళా కార్యదర్శులతో దిశ యాప్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించి, డౌన్లోడ్ చెయించి రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. దిశా యాప్ రిజిస్ట్రేషన్ డౌన్లోడ్స్ గురించి ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి ట్రాఫిక్ నిబందనలు ఉల్లంగించిన వారిపై యం. వి. చలనాలు విధించి వారిపై కేసులు నమోదు చేశారు. అలాగే ప్రజలకు, రహదారి భద్రతలో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తులు, వాటి వలన కలిగే అనర్థాలు పట్ల అవగాహన కల్పించారు .

క్రీడా దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టెన్నిస్ క్రికెట్ చాంఫియన్ షిప్ పోటీలలో అంపైర్లకు టీషర్ట్‌లను తెలుగుగంగ ఏఈ సలీం శుక్రవారం వితరణగా అందజేసారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నందు జరుగుతున్న 4 వ జూనియర్స్ రాష్ట్ర స్థాయి టెన్నిస్ క్రికెట్ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తున్న వివిధ జిల్లాలకు చెందిన 12 మందికి టీషర్టను అందజేసారు. కార్యక్రమంలో ఎన్‌డిటిసిఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవంత్,జిల్లా కార్యదర్శి కడ్డీ మహబూబ్ బాషా,విద్యా కమిటీ చైర్మన్ అబ్దుల్లా,జాతీయ ఏ గ్రేడ్ అంపైర్ జగన్నాధరావు, ఖదీర్, ఖాదర్‌బాష, ప్రదీప్,పిడి దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

31న జలజాగరణ దీక్ష

ప్రజాశక్తి - నంద్యాల

సిద్ధేశ్వరం అలుగు సాధనకు ఈనెల 31న జలజాగరణదీక్ష చేపటనున్నట్లు రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో మే 31న జరిగే సిద్దేశ్వరం అలుగు ఏడవ వార్షికోత్సవ సందర్భంగా సమావేశం నిర్వహించారు. దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమలో ఉద్యమ స్ఫూర్తిని నింపిన సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన ఏడవ వార్షికోత్సవం పురస్కరించుకుని సిద్దేశ్వరం జల జాగారణ దీక్ష చేపట్టాలని నిర్ణయించడమైనదని అన్నారు.

మిర్చి యార్డ్ దినదినాభివృద్ధి హర్షణీయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మిర్చి రైతులకు లాభదాయకమైన గిట్టుబాటు ధరలను కల్పిస్తూ నంద్యాల మిర్చి యార్డ్ దినదినాభివృద్ధి సాధించడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల బైపాస్ మిర్చి యార్డ్ ను ఎమ్మెల్యే, మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, మేనేజర్ కల్పన, బోర్డు డైరెక్టర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలోని నంద్యాల, కర్నూలు ఉమ్మడి జిల్లాల్లో అత్యధికంగా మిర్చి పంటలను సాగు చేసే రైతులు ఉన్నారని, మిర్చి దిగుబడులను మార్కెట్లో విక్రయించుకునేందుకు గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లేందుకు ఎంతో ప్రయాసలకు లోను కావడం జరుగు తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మిర్చి రైతులకు లాభదాయకమైన గిట్టుబాటు ధరలను కల్పిస్తు న్నామని తెలిపారు. మిర్చి రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను తీర్చాలని, మిర్చి పంట దిగుబడులకు లాభదాయకమైన గిట్టుబాటు ధరలను కల్పించేందుకు నంద్యాలలో మిర్చి యార్డును ఏర్పాటు చేయాలని నంద్యాలలో జరిగిన బహిరంగ సభలో సీఎం జగన్ మోహన్ రెడ్డిని కోరడం జరిగిందన్నారు. వెంటనే సీఎం స్పందించి నంద్యాలలో మిర్చి యార్డు ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశారన్నారు. ఇందులో భాగంగా మార్చి రెండవ తేదీ నుండి నంద్యాలలో మిర్చి యార్డులో మిర్చి కొనుగోళ్లను ప్రారంభించడం జరిగిందన్నారు. నంద్యాల, చుట్టుపక్కల ప్రాంత మిర్చి రైతుల పంట దిగుబడులను లాభదాయకమైన గిట్టుబాటు ధరలను కల్పించడం సంతోషంగా ఉన్నారన్నారు. మిర్చి యార్డ్ ప్రారంభమైన తర్వాత ఇటు రైతులు అటు ట్రేడర్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చిమ్మ నాగన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మేనేజర్ కల్పన మిర్చి రైతులు, ట్రేడర్లు పాల్గొన్నారు.

మిర్చి కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మహానందిలో రాహు, కేతు విగ్రహ ప్రతిష్ట

- పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

ప్రజాశక్తి - మహానంది

మహానంది పుణ్యక్షేత్రంలో శ్రీకామేశ్వరీ దేవి సమేత మహానందీశ్వరుడి దర్శనం అనంతరం మహానంది ఆలయంలో నూతన రాహు, కేతువు మండపాన్ని ప్రారంభించి, విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ అభివృద్ధి గురించి ఇఒకాపు చంద్రశేఖర్ రెడ్డితో చర్చించి, పలు సూచనలు చేశారు. అనంతరం మహానంది దేవస్థానం, సమీకృత గిరిజనాభివృద్ధి శ్రీశైలం వారి ఆధ్వర్యంలో చెంచు గిరిజనులకు ఎమ్మెల్యే ఆవులు, కోడె దూడలను అందజేశారు. అంతకుముందు ఎమ్మెల్యే శిల్పా క్షేత్రంలో జరుగుతున్న వివాహ కార్యక్ర మంలో పాల్గొన్నారు. శుక్రవారం నుండి నుండి ప్రారంభమైన రాహుకేతు పూజలకు అవసరమైన 200 వెండి నాగపడిగెలను మహానంది దేవస్థానము ముఖ్య అర్చకులు రాజా రత్తయ్య, బాబు స్వామి సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, మహానంది సర్పంచ్ శిరీష, ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, దాతలు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే

స్వామివారి సేవలో ప్రముఖులు

మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి దేవి సమేత మహానందీశ్వర స్వామి వార్లను కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి రామచంద్ర, తెలంగాణ మాజీ డిజిపి మహేందర్ రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఇఒ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు శేష వస్త్రాలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి రాహుకేతు పూజల తొలి టికెట్టును తీసుకుని భక్తులతో కలిసి పూజలు నిర్వహించారు.

ర్యాలీ నిర్వహిస్తున్న రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు

మొక్కలు నాటి పర్యావరణాన్నిరక్షించండి

- రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు

ప్రజాశక్తి - రుద్రవరం

ప్రతి ఇంటికి ఒక మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు తెలిపారు. శుక్రవారం మండలంలోని హరినగరం గ్రామంలో పర్యావరణ హిత జీవనశైలి కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. జిల్లా అటవీ అధికారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. పర్యావరణ హిత జీవనశైలిలో భాగంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూతల సెక్షన్ సెక్షన్ అధికారి,ఎన్. శ్రీనివాసులు రెడ్డి వై నాగేంద్రయ్య, ఎఫ్‌బిఒ, టి. రామకృష్ణ, ఎఫ్‌బిఒ ప్రొటెక్షన్ వాచర్ దానమయ్య, హరినగరం గ్రామ పంచాయతీ కార్యదర్శి శివ కృష్ణ, గ్రామ పెద్ద నాగముని, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శ్రీశైలంలో ఉచిత సామూహిక సేవలు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల దేవస్థానంలో ఉచిత సామూహిక సేవలను దేవస్థానం శుక్రవారం నిర్వహించింది. ధర్మ ప్రచారంలో భాగంగా శ్రవణా నక్షత్రం పురస్కరించుకొని తెల్ల రేషన్ కార్డు కలిగిన వారి సౌకర్యార్థం ప్రవేశపెట్టిన ఉచిత సామూహిక సేవలో శ్రీశైలం అక్కమహాదేవి అలంకార మండపం లో కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సామూహిక కుంకుమార్చనలో 110 మంది భక్తులు ఉచిత సేవలు బుకింగ్ చేసుకున్నారు వారికి ఈ సేవల్లో అవకాశం కల్పించారు. ఈ ఉచిత కుంకుమార్చన కార్యక్రమంలో స్థానిక లతో పాటు ఇతర రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

ఆర్‌బికెల్లో ఎరువులు, విత్తనాలు

ప్రజాశక్తి - ఆత్మకూర్

రైతులకు అందుబాటులో ఉండే విధంగా గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాలలో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ ఏడిఏ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం నాడు పట్టణంలోని స్థానిక రైతు భరోసా కేంద్రం నందు మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఆంజనేయులు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో ప్రతి ఆర్‌బికెలో రసాయనిక ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, పిల్లి పెసర అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే ఈ సమావేశం లో రైతులకు మొక్కజొన్న విత్తనాలను, జింకు, జిప్సం 50 శాతం సబ్సిడీపై ఇవ్వవలసిందిగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడ్వైజరి బోర్డు మెంబర్ రాజమోహన్ రెడ్డి, పశు సంవర్ధక శాఖ అధికారి శివసాగర్ రెడ్డి, పట్టు పరిశ్రమ శాఖ అధికారి అరుణ, వ్యవసాయ శాఖ సిబ్బంది, అడ్వైజరీ బోర్డు నంబర్స్, రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడిఏ ఆంజనేయులు

పోరాటాలతో జిఒ 1 రద్దు : సిఐటియు

ప్రజాశక్తి - ఆత్మకూర్

రాష్ట్రంలో సభలు, రోడ్ షోలు, ర్యాలీలపై ఆంక్షలు విధిస్తూ వైసీపీ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెం1ని హైకోర్టు రద్దు చేయడం ప్రజా పోరాటాల ద్వారానే సాధ్యమైందని సిఐటియు జిల్లా అధ్యక్షులు యేసు రత్నం, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రజాక్, రామ్ నాయక్‌లు పేర్కొన్నారు. శుక్రవారం వారు మాట్లాడు తూ ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయకు ఒడా వైసిపి ప్రభుత్వం జీవో నెంబర్ ఒకటి తీసుకురా వడం దారుణం అన్నారు. ప్రజల గొంతుకలను హరించే విధంగా వైసిపి ప్రభుత్వం తీసుకొని వచ్చిన జీవో నెంబర్ 1ని హైకోర్టు రద్దు చేయడం శుభపరిణామ న్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసే ందుకు నిరసనలు ర్యాలీలు సభలు చేయడం వీటి ద్వారా ప్రభుత్వానికి తెలియజే యడం ఎన్నో సంవత్సరాల నుంచి కొనసాగుతుందన్నారు.

నంద్యాల : జిఒ 1ని హైకోర్టు రద్దు చేయడం హర్షనీయమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేకమైన జీవోలను తీసుకురావడం మానుకోవాలని అన్నారు.

ప్రభుత్వానికి చెంపపెట్టు : టిడిపి

డోన్ :

ప్రతిపక్షాల గొంతు నొక్కే జీవో నెం. 1ని హైకోర్టు కొట్టివేయడం జగన్ రెడ్డికి చెంపపెట్టు అని డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. ప్రజల స్వేచ్ఛను హరించునటువంటి జీవో నెం.1ను కొట్టి వేయడం ప్రజల విజయం అన్నారు.

ఎన్ని శక్తులు ఏకమైనా వైసిపిదే విజయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాగలమర్రి

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్ని శక్తులు ఏకమై పోటీ చేసిన వైసిపి తిరిగి అధికారంలోకి వస్తుందని మాజీ ప్రభుత్వ విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఆళ్లగడ్డ శాసన సభ్యులు గంగుల బిజెంద్రారెడ్డిలు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం చాగలమర్రిలోని శ్రీ వాసవి జూనియర్ కళాశాలలో ఆర్యవైశ్య వైసిపి నాయకుడు రాచమడుగు రమణ గుప్తా ఎపిడబ్ల్యుసిఎఫ్‌సి డైరెక్టర్ శ్రీమతి రాచమడుగు శ్రీ బాల విద్య దంపతుల కుమారుడు సాయి నిమేష్ వివాహ వేడుకలకు వారు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడమే గాక, ఇవ్వని హామీలను కూడా అమలు చేశారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబూలాల్, ఆ పార్టీ మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, మండలాధ్యక్షుడు వీరభద్రుడు, మండల ఉపాధ్యక్షుడు ముల్లా రఫీ, మండల కోఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, ఎంపీటీసీ సభ్యులు పత్తి నారాయణ, లక్ష్మిరెడ్డి, ఫయాజ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ముల్లా జాబీర్, సాగునీటి సంఘ అధ్యక్షుడు శేషు రమేష్, తోడేండ్లపల్లి సర్పంచ్ గోవిందయ్య, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదిస్తున్న గంగుల ప్రభాకర్ రెడ్డి ,ఎమ్మెల్యే నాని

తూనికలు, కొలతల అధికారుల తనిఖీలు

- జరిమానా, కేసు నమోదు

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల పట్టణంలో వివిధ వ్యాపార దుకాణాలను డోన్ డివిజన్ తూనికలు కొలతల ఇన్స్పెక్టర్ ఖాజా హుస్సేన్ శుక్రవారం నాడు తనిఖీ చేశారు. పట్టణంలోని కిరాణం, వస్త్రా దుకాణాలు, కూల్ డ్రింక్ షాపులు తదితర దుకాణాలపై తనిఖీ నిర్వహించి పరిశీలించారు. కూల్ డ్రింక్ షాపు లో ప్రభుత్వం నిర్ణయించిన ధన కంటే ఎక్కువ ధరలకు అమ్ముతున్నందున ఐదువేల రూపాయలను జరిమాల విధించారు. వస్త్ర దుకాణాలు కిరాణం షాపులనూ తనిఖీ చేసి జరిమానా విధించి, కేసులు నమోదు చేశారు.

నిరుపేదలకు ప్రైవేటు పాఠశాలల్లో సీట్లు

ప్రజాశక్తి - రుద్రవరం

నిరుపేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయింపు జరిగిన్నట్లు ఎంఈఓ కోటయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్ట ప్రకారం 2023-24వ సంవత్సరం కొరకు ఆర్థికంగా వెనకబడిన ఉన్న పేదలకు కేటాయించేం దుకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 6 నుంచి 15వ తేదీ వరకు తేదీలను పొడిగించడం జరిగిందన్నారు. అన్ని ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచితంగా ప్రవేశాలు కల్పిస్తామని విద్యార్థుల తరపున ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రామసభతో పారదర్శకత

ప్రజాశక్తి - అవుకు

గ్రామ సభలతో ప్రభుత్వం అందించే వివిధ పథకాల అమలులో పారదర్శకత ఏర్పడుతుందని సర్పంచి కాటసాని రమాకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గుండ్ల సింగవరం గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొని ప్రజలకు సంబంధిత పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ కమల్ సాహెబ్, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, ఆరోగ్య కార్యకర్త చంద్రకళ, సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

16న నంద్యాలలో యువగళం పాదయాత్ర

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

రాష్ట్ర ప్రజల శ్రేయస్సుకోసం నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర నంద్యాలలో ఈ నెల 16,17 ఉంటుందని తెలుగుదేశం యువనేత భూమా జగత్ విఖ్యాత రెడ్డి పేర్కొన్నారు. ఆయన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో యువగళం పాదయాత్ర విశేషాలు తెలియజేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నంద్యాలలో బహిరంగ సభ అనుమతులు వచ్చిన తర్వాత వెల్లడిస్తామని అన్నారు. హైకోర్ట్ జీఓ నెంబర్ 1ని రద్దు చేయడం హర్షణీయం అన్నారు. యువగళం పాదయాత్రకు యువకులు, మహిళలు, ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున రావాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్లు ఏ.వి.ఆర్.ప్రసాద్,శివ శంకర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజలకు మేలు

ప్రజాశక్తి - అవుకు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ కార్యక్రమం పట్ల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుం దని ఉప్పలపాడు ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ టి వినోద్ కుమార్ ప్రజలకు వైద్య పరీక్షలను నిర్వహించారు. 40 మందికి సాధారణ పరీక్షలు, 19 గర్భవతులకు రక్త పరీక్షలు, అయిదుగురు బాలింతలకు, 44 మంది రక్తపోటు, డయాబెటిస్ వ్యాధిగ్రస్తులను పరీక్షించి ఉచితంగా మందులు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఫిరోజ్ ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పిడిఎఫ్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - బనగానపల్లె

పేద ప్రజలకు సివిల్ సప్లై రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేసే పిడిఎఫ్ బియ్యం 177 బ్లాక్ మార్కెట్ తరలిస్తుండగా విజిలెన్స్ సిఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి పట్టుకున్నారు. శుక్రవారం పట్టణంలో మూడు వాహనాల్లో వివిధ ప్రాంతాల నుండి బనగానపల్లె రైస్ మిల్లులకు 177 ప్యాకెట్ల పిడిఎఫ్ బియ్యాన్ని తీసుకొని వస్తుండగా విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి ఒక అల్విన్ లారీ, రెండు మహేంద్ర టర్బో వాహనాలను సీజ్ చేసి, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సిఐ సునీల్ కుమార్ మాట్లాడుతూ దొర్నిపాడుకు చెందిన శివయ్య, అవుకు మండలం గోకులదిన్నె గ్రామానికి చెందిన సుదర్శన్ రెడ్డిలు గ్రామాలలో పేద ప్రజలకు పంపిణీ చేసే బియ్యాన్ని సేకరించి బనగానపల్లెలోని రైస్ మిల్లులకు సరఫరా చేస్తున్నట్లు సమాచారంతో దాడులు నిర్వహిం చామ న్నారు. పట్టుబడిన బియ్యాన్ని సీజ్ చేసిన వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ తహశీల్దార్ నారాయణ, సివిల్ సప్లై ఆర్ఐ రబ్బాని, విజిలెన్స్ పోలీసులు పాల్గొన్నారు.

పట్టుకున్న పిడిఎఫ్ బియ్యం

రాష్ట్రస్థాయి ఎద్దుల పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

పట్టణంలోని పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర స్థాయి ఎద్దుల పోటీలను శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక రైతు బిడ్డగా వషభ పోటీలను ప్రోత్సహించాలని లక్ష్యంతో పెద్ద కుమారుడు కాటసాని నాగార్జున రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా లక్ష రూపాయల బహుమతులను అందజేయడం జరిగిందన్నారు. పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా పార్టీలకతీతంగా ప్రజలందరూ కలిసి నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కోయిలకుంట్ల వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బివి నాగార్జున రెడ్డి, ఉప సర్పంచ్ జిసిఆర్ సూర్యనారాయణ రెడ్డి, రైతు సంఘం నాయకుడు కానాల రవి రెడ్డి, ఏపీ ఎన్జీవోస్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గువ్వల రామకష్ణారెడ్డి, కోవెలకుంట్ల మండల గ్రామ సచివాలయం కన్వీనర్ లాయర్ మధుసూదన్ రెడ్డి, వైఎస్ఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఉన్నత స్థాయిలో రాణించాలి

ప్రజాశక్తి - వెలుగోడు

విద్యార్థులు బాగా చదివి అత్యున్నత స్థాయికి చేరుకోవాలని జాతీయ బి.సి.సంక్షేమ సంఘము రాష్ట్ర కార్యదర్శి ఎస్.రఘు రాముడు యాదవ్, జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.నాగశేషులు అన్నారు. శుక్రవారం వేంపెంట రహదారిలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు చేసి నేటికి 5 సంవత్సరాలైన సందర్భంగా పూల మాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం 10 తరగతిలో 500 మార్కులు పైగా సాధించిన విద్యార్థులైన సాయి కీర్తి (536 మార్కులు), శివ నందిని (527 మార్కులు)లకు శాలువతో సన్మానించి మెమోంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో సప్తైర్ షాప్ నాగన్న, రంగస్వామి, అంకన్న, ఎల్లయ్య, పేపర్ శివుడు, వినోద్, రాజేష్, కృష్ణ, ఈశ్వరయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

అధిక మార్కులు పొందిన విద్యార్థిని సన్మానిస్తున్న బి.సి.నాయకులు

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు ఎంపీడీవో కార్యాలయం నందు ఎంపీపీ సరోజినీ వర్ధినయ అధ్యక్షన నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాధాసీదాగా సాగింది. ఎంపీడీవో సుమిత్రమ్మ, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రజ సమస్యలపై చర్చ జరపలేదు. మండల స్థాయి అధికారులు గత మూడు నెలల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆర్టీసీ రిక్వెస్ట్ స్థాపన ఏర్పాటు చేయాలని అధికారులు ఎంపీపీ దృష్టికి తెచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ తాసిల్దార్ పటాన్ బాబు, ఏవో కర్ణ సాగర్, వ్యవసాయ అధికారి పరమేశ్వర్ రెడ్డి, ఏపిఎం అనురాధ, ఏపీవో విమలమ్మ, డాక్టర్ లావణ్య పాల్గొన్నారు.

శిల్పి దురుగడ్డ శేఖరాచారికి సన్మానం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

భక్తుల సౌకర్యార్థం మహానంది దేవస్థానానికి రాహు, కేతు విగ్రహాలు, మండపం నిర్మాణంను అద్భుతంగా తీర్చిదిద్దిన శిల్పి దురుగడ్డ శేఖరాచారిని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఆళ్లగడ్డ శ్రీ శారద శిల్పకళా మందిరం నిర్వాహకులు రవీంద్రచారి కుమారుడైన శేఖరాచారి ఇటీవల యాదగిరిగుట్ట క్షేత్రంలో కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా సన్మానం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మహానంది ఈవో చంద్రశేఖర్ రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

శిల్పిని సన్మానిస్తున్న దృశ్యం

LOST DOCUMENT

K.Subbarayudu, H.No. 10/465, K.K.Street, Proddutur (Town), Kadapa (Dt), A.P. Lost my Original Sale Deed Document No.636/2002, S.R.O Pedda Ambarpet, Hyderabad. Telangana While Traveling From Proddutur to Allagadda at R.T.C Bus Stand Allagadda. If Found the Document Please Call : K.Subbarayudu, K.Subba Rao. Cell : 9490631871

IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE: DHONE.
O.S.No. 368/2022.

Shaik Mahaboob Basha, S/O Abdul Rajak, aged about 50 years, private employee, R/O Dhone town and Mandal, Kurnool District. ...PLAINTIFF

V/S

1) N.K.Sankhar Baghavan S/O late Nagappa, aged about aged about 64 years, cultivation, Hindu, R/O mettupalli village, peapully Mandal, Kurnool district.
2) N.K.Lakshmi Devi W/O late Chakrapani, aged about aged about 56 years, cultivation, Hindu, R/O H.NO 5-81, Koilakonda village, krishnagiri Mandal, Kurnool district.
3) N.K.Murali S/O late Nagappa, aged about aged about 55 years, business, Hindu, R/O H.NO 8-51, Kambalapadu road, Dhone town and Mandal, Kurnool district.
4) N.K.Yellappa S/O late N.K.krishna Murthy, aged about aged about 45 years, cultivation, Hindu, R/O H.NO 8-41, yenugumarri village, peapully Mandal, Kurnool district.
5) N.K.Yellappa S/O Murali, aged about aged about 35 years, Business, Hindu, R/O H.NO 8-51, Kambalapadu road, Dhone town and Mandal, Kurnool district.
6) N.K.Depak S/O Murali, aged about aged about 32 years, Business, Hindu, R/O H.NO 8-51, Kambalapadu road, Dhone town and Mandal, Kurnool district.
7) N.K.Krishnamurthy S/O late nagappa, aged about aged about 65 years, cultivation, Hindu, R/O H.NO 8-41, yenugumarri village, Peapully Mandal, Kurnool district. (Since died his legal heirs).
8) Padmavathi W/O late N.K.Krishnamurthy, aged about aged about 55 years, cultivation, Hindu, H.NO 8-41, yenugumarri village, peapully Mandal, Kurnool district. ...DEFENDANTS

SUMMONS TO DEFENDANT NO.4 & DEFENDANT NO.8

పై Suit నందు Plaintiff తన Agreement of sale Advance Amount ను రాబట్టుకొనుటకు పై కోర్టు నందు పై Suit వేసియున్నారు. పై Suit 18/05/2023వ తారీఖున పై కోర్టు నందు వాయిద కలదు. కావున Defendant no.4 మరియు Defendant no.8 అయిన మీరు ఉదయం 10.30 గంటలకు స్వతహాగా కాని Advocate ద్వారా కాని పై కోర్టు నందు హాజరు కావలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించడం జరుగునని తెలియజేయడం అయినది.

By Court Order
G. Madhusudhana Rao,
Advocate for Plaintiff,
Dhone, Nandyla Dist.
Cell : 9441733503

పాత పద్ధతిలో 'ఉపాధి' కొనసాగించాలి

5వ పేజీ తరువాయి...

మెడికల్ ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని, ప్రమాద బీమా కొనసాగించాలని, తదితర సమస్యలు పరిష్కారం కొరకు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఉపాధి కూలీలు పెద్ద సంఖ్యలో రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర, నరసింహ, రంగన్న, లచ్చుమ్మ, యశోద, అరుణమ్మ, తత్తురు బాబు, బాలరాజు, నాగన్న, పెద్దరాజు, శేషన్న, ఉపాధి కూలీలు పాల్గొన్నారు. **బిజీనేముల గ్రామంలో..** ఫోటో యాప్ రద్దుచేసి, పాత పద్ధతి కొనసాగించాలని పెండింగ్ బిల్లులు చెల్లించాలని, తదితర సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని వ్యాకాస జిల్లా సహాయ కార్యదర్శి పి పకీర్ సాహెబ్, సిఐటియు జిల్లా నాయకులు టి.గోపాలకృష్ణ కోరారు. శుక్రవారం నందికొట్కూరు మండలంలోని బిజీనేముల గ్రామం లో ఉపాధి కూలీలు చేస్తున్న ఉపాధి పనులను వారు పరిశీలించి, సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నరేష్, నాగేశ్వరరావు, నాగ శేఖర్ గౌడ్, సత్యం, శాంతకుమారి, కళ్యాణి, చంద్రమోహన్, రవి బాబు, బాషా, వెంకటేష్, రాంబాబు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫోటో యాప్ రద్దుచేసి పాత పద్ధతి ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ నాయక్, రైతు సంఘం మండల అధ్యక్షులు మా బాషలు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కురుకుంద గ్రామంలో ఉపాధి కూలీలతో వారు మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం నిధులు తగ్గించి కూలీలతో చెల్లగాటం ఆడుతుందన్నారు. తక్షణమే బిజెపి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి నిధులు పెంచి ఉపాధి కూలీలను ఆదుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫోటో యాప్ రద్దుచేసి పాత పద్ధతి ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలన్నారు. 2005 జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని యధావిధి కొనసాగించాలని, రూ.600 కూలి ఇవ్వాలన్నారు. జాబు కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రెండు వందల పని దినాలు కల్పించాలన్నారు. పనిచేస్తున్న గ్రూపులన్నిటికీ గడ్డపార చలిక ప్రతి గ్రూపుకు ఇవ్వాలని ఉపాధి పనుల దగ్గర మౌలిక వస్తువులు కల్పించి వడదెబ్బ నుండి కూలీలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు. టెంటు సౌకర్యం మెడికల్ కిట్టు ప్రతి మేటికి ఒక్కొక్కరి పైన ఐదు రూపాయలు పారతోషకం ఇవ్వాలన్నారు. ప్రమాద బీమా రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీలకు వారం వారం ప్లేస్ షిప్‌లు ఇవ్వాలన్నారు. వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల15న జిల్లా కేంద్రంలో జరగనున్న ఆందోళన కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మేటిలు లింగ స్వామి, రమేష్, పుల్లయ్య, ఉపాధి కూలీలు పాల్గొన్నారు. **నంద్యాల రూరల్:** జిల్లాలో ఉపాధి కూలీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం. సుధాకర్, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు పుల్ల నరసింహులు డిమాండ్ చేశారు. నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామంలో పనిచేస్తున్న కూలీలతో వారు మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. **పాణ్యం:** ఈనెల 15న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కృష్ణ, సిఐటియు మండల కార్యదర్శి కె భాస్కర్, ఎస్ఎఫ్ఐ నాయకులు బత్తిని ప్రతాప్‌కోరారు. శుక్రవారం వారు ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేజే శ్రీనివాసరావు, దేవదానం, తదితరుల పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ రాజశేఖర్